అంగన్‌వాడీలకు చేరిన కందిపప్పు



అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: ఎట్టకేలకు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు చేరింది. నిర్దేశిత గడువులోపు సరఫరా చేయడంలో గుత్తేదారులు వైఫల్యం చెందిన వైనంపై ఈనెల 22న 'కందిపప్పు అరకొరే' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు వినోద్‌కుమార్, చేతన్ తీవ్రంగా స్పందించి.. వెంటనే సరఫరా చేయాలని గుత్తేదారులను ఆదేశించారు. దీంతో గుత్తేదారులు అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు ప్యాకెట్లను సరఫరా చేశారు. అనంతపురం జిల్లాలో మొత్తం 41,217 కిలోల ప్యాకెట్ల కందిపప్పు అందజేయాల్సి ఉంది. బుధవారం నాటికి పదకొండు ప్రాజెక్టులకు గాను తొమ్మిది ప్రాజెక్టుల్లో వందశాతం పంపిణీ జరిగింది. శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని మొత్తం 12 ప్రాజెక్టులకు 30,965 కిలోల కందిపప్పు ప్యాకెట్లను లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు నమోదు చేశారు. ఇక్కడ 12 ప్రాజెక్టుల్లో వంద శాతం మేర కేంద్రాలకు అందజేసినట్లు ఆన్‌లైన్‌లో నమోదు కావడం విశేషం.

ఈనాడు కథనానికి స్పందన

సర్కారు స్థలంలో రియల్ దందా



● వెంచర్లు వేసి.. సొమ్ము చేసుకుంటూ...
● రెచ్చిపోతున్న ఆక్రమణదారులు

ఈనాడు డిజిటల్, అనంతపురం

కబ్జాదారులు ఏకంగా ప్రభుత్వ భూముల్లోనే వెంచర్లు ఏర్పాటు చేసి విక్రయాలు సాగిస్తున్నారు. అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు, నోటీసులను ఖాతరు చేయడం లేదు. అధికారులు సైతం అక్రమార్కుల దౌర్జన్యాన్ని చూసి చూడనట్లు వదిలేస్తున్నారు. జాతీయ రహదారి సమీపంలోని గుత్తి మండలం బాచుపల్లిలో ప్రభుత్వ ఆస్తుల కబ్జాపర్వం సాగుతూనే ఉంది. ప్లాట్లు వేసి సెంటు రూ.5 లక్షలు చొప్పున విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

5 ఎకరాల్లో పాగా..

కరిడికొండ రెవెన్యూ పరిధి బాచుపల్లిలో 188, 179 సర్వే నంబర్లలోని సుమారు 5 ఎకరాల ప్రభుత్వ భూమిని స్థానిక నాయకులు ఆక్రమించారు. వైకాపా హయాంలో గ్రామ ప్రజాప్రతినిధి సుమారు 5 ఎకరాలు కబ్జా చేశారు. గతంలో ఓ వ్యక్తికి అసైన్డ్ చేసిన భూమిని సైతం ఆక్రమించి లేఅవుట్ ఏర్పాటు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పక్కనే ఉన్న అసైన్డ్ భూముల్లో ప్లాట్లు ఏర్పాటు చేసి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉండటంతో డిమాండ్ ఎక్కువ ఉంది. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి విలువ రూ.20 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ఇటీవల గ్రామానికి చెందిన కొంతమంది నాయకులు 179 సర్వే నంబరులో 1.6 ఎకరాలు కబ్జా చేసి లేఅవుట్ వేశారు. ఇప్పటికే కొన్ని ప్లాట్లను రూ.10 లక్షలు చొప్పున విక్రయించి సొమ్ము చేసుకున్నారు.

నోటీసులతో సరిపెట్టి..

ఆక్రమణలపర్వంపై ఈనెల 17న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు విచారణ జరిపి ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు జారీ చేశారు. ఆక్రమణలకు పాల్పడిన గ్రామ ప్రజాప్రతినిధికి కాకుండా ఆయన వెంట ఉన్న కొందరికి నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. నిబంధనల మేరకు నోటీసులు అందించిన ఏడు రోజుల్లో తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉంది. అధికారులు ఇప్పటివరకు బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా.. లేఅవుట్‌ను కనీసం తొలగించే ప్రయత్నం చేయలేదు. అధికారులు పాతిన బోర్డును తొలగించి యథేచ్ఛగా ప్లాట్లు విక్రయిస్తుండటం గమనార్హం.

క్రిమినల్ చర్యలు తీసుకుంటాం

- ఓబులేసు, తహసీల్దార్, గుత్తి

ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనట్లు తేల్చాం. ఇప్పటికే బాధ్యులకు నోటీసులు జారీ చేశాం. హెచ్చరిక బోర్డును తొలగించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను తొలగిస్తాం.



188 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమిలో పునాదులు

పట్టు రైతులూ.. 'ఈనాడు' మీతోడుగా..

బైవోల్టిన్ పట్టు రైతులకు అందాల్సిన ప్రోత్సాహక బకాయిలు, రాయితీలు, పథకాలు, సాగులో ఇబ్బందులు, పాటించాల్సిన మెలకువలపై పట్టు పరిశ్రమ శాఖ జేడీ (జాయింట్ డైరెక్టర్) దుగ్గిరాల పద్మావతితో ఫోన్‌లో సంప్రదించే అవకాశాన్ని 'ఈనాడు' కల్పిస్తోంది. పట్టు రైతులు కింది ఫోన్ నంబర్లలో సంప్రదించి.. జేడీ ద్వారా సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

ఎప్పుడు: నేడే (గురువారం)
సమయం: ఉదయం 11 గంటల నుంచి 12 గంటలలోపు
సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 98666 99198, 80085 73039


ఉద్యోగుల బదిలీలు అస్తవ్యస్తం

పలు శాఖల్లో మార్పుచేర్పులకు కసరత్తు చేస్తున్న వైనం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే

క్షేత్ర స్థాయిలో ప్రజాపాలన సాఫీగా సాగడానికి తెదేపా కూటమి ప్రభుత్వం.. సాధారణ బదిలీలకు ఇచ్చిన అవకాశాన్ని కొన్ని శాఖల అధికారులు దుర్వినియోగ పరిచేలా వ్యవహరించడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా బదిలీలు చేయడంపై ప్రజాప్రతినిధులు సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలతో నిమిత్తం లేకుండా ఇష్టానుసారం బదిలీలు జరిగినట్లు చెబుతున్నారు. రెవెన్యూ, జడ్పీ, పంచాయతీ, వెలుగు, పంచాయతీరాజ్, పౌరసరఫరాలు, ఇంజినీరింగు.. తదితర శాఖల్లో చేతివాటం ప్రదర్శించారని అనంతపురం కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఫిర్యాదులు అందాయి.

గతనెల 19న మొదలై: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారి కొన్ని శాఖలకే పరిమితం చేస్తూ సాధారణ బదిలీలు చేపట్టారు. ఆగస్టు 19 నుంచి 31వ తేదీలోపు బదిలీలను పూర్తి చేయాలని జీవో 75ను జారీ చేశారు. అదే నెలలోనే వరదలు, పింఛన్ల పంపిణీ ఉండటంతో ఈనెల 15వ తేదీ దాకా గడువు పొడిగించారు. తర్వాత విజయవాడ వరదల సహాయక చర్యల్లో పాల్గొనడానికి రెవెన్యూ, సచివాలయ, మున్సిపల్, విద్యుత్తు.. తదితర శాఖల అధికారులు, ఉద్యోగులు వెళ్లారు. మూడోసారి మళ్లీ ఈనెల 22 వరకు గడువు ఇచ్చారు. ఇలా రెండు దఫాలు గడువు పొడిగించినా కొన్ని శాఖల జిల్లా అధికారులు బదిలీల జాబితా తయారీలో జాప్యం చేశారు. గడువు ముగియనున్న సందర్భంలో బదిలీలు జరిపారు. గత వైకాపా పాలనలో అంటకాగిన వారికి జిల్లా కేంద్రానికి సమీపంలోని స్థానాలు కేటాయించడంతో కొందరు ప్రజాప్రతినిధులు తీవ్ర అసంతృప్తి వ్యక్త పరిచారు. మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లారు.



● జిల్లా పరిషత్తులో గడువు 22లోపు బదిలీలు చేయలేదు. 23 అర్ధరాత్రి దాకా ఉద్యోగులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఇన్‌ఛార్జి సీఈఓ అందుబాటులో లేకపోవడంతో ఉద్యోగులు నిరసన తెలిపారు. విషయాన్ని తెలుసుకున్న కలెక్టర్ సదరు అధికారిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విధిలేక అర్ధరాత్రి తర్వాత బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. వాటిని వాట్సప్ గ్రూపులో పోస్టు చేయడం విశేషం. ప్రభుత్వ మార్గదర్శకాలను ఏమాత్రం పరిగణలోకి తీసుకోలేదు. వైకాపాతో అంటకాగిన వారికి ప్రాధాన్య స్థానాలు రావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మళ్లీ మార్పుచేర్పులు చేస్తున్నట్లు సమాచారం.

● రెవెన్యూ శాఖలో ఐదారోజులు సుదీర్ఘ కసరత్తు చేసినా నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పూర్తి చేయలేదు. ఒకే రోజు 120 మందికి బదిలీ ఉత్తర్వు జారీ చేశారు. ఇందులో ఉప తహసీల్దార్లు 73 మంది, సీనియర్ సహాయకులు 33, జూనియర్ సహాయకులు 11, కంప్యూటర్ ఆపరేటర్లు ముగ్గురు చొప్పున ఉన్నారు. వీఆర్‌ఓల జాబితాపైనా నీలినీడలు కమ్ముకున్నాయి. డీటీ, వీఆర్‌ఓ, ఆర్‌ఐ.. తదితర కేడర్ల విషయంలో కొందరు ఎమ్మెల్యేలు అభ్యంతరం తెలిపారు. ఆయా కేడర్ల బదిలీల్లో మార్పుచేర్పులపై కసరత్తు సాగుతోంది.

● డీఆర్‌డీఏ-వెలుగులో బదిలీలు ఇష్టారాజ్యంగా జరిగాయి. డీపీఎంలు నలుగురు, ఏపీఎంలు 32 మంది, సీసీలు 60 మందిని బదిలీ చేశారు. ఉద్యోగుల ఆప్షన్లను పరిగణలోకి తీసుకోలేదు. పనితీరు ఆధారంగా చేయలేదు. నచ్చిన వారికి మంచి స్థానాలు, నచ్చని వారిని సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారు. ఈ ప్రాజెక్టులో జరిగిన బదిలీలపై కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. ఇందులోనూ మళ్లీ మార్పుచేర్పులు సాగుతున్నాయి.

● జిల్లా నీటి యాజమాన్య సంస్థలో(డ్వామా) బదిలీల ఊసేలేదు. ప్రభుత్వం అనుమతి ఇచ్చినా ఇక్కడి యంత్రాంగం ఏమాత్రం దృష్టి సారించలేదు. ఇదిగో అంటూ ఊరిస్తున్నారే తప్ప... ఇప్పటికీ సమాచారం బయటకు పొక్కలేదు. ఇక్కడి పీడీ బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జి కొనసాగుతున్నారు. రెగ్యులర్ పీడీ అక్టోబరు 2 తర్వాత వస్తారని భావిస్తున్నారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యానికి రూ.10 లక్షల పరిహారం

వినియోగదారుల న్యాయస్థానం తీర్పు

అనంతపురం (లీగల్), న్యూస్‌టుడే: వైద్యసేవల్లో జరిగిన నిర్లక్ష్యానికి బాధిత కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని జిల్లా వినియోగదారుల న్యాయస్థానం అధ్యక్షురాలు ఎం.శ్రీలత బుధవారం తీర్పునిచ్చారు. అనంతపురానికి చెందిన అనిల్‌కుమార్ (38) వాంతులు రావడంతో స్థానిక వైద్యుల సలహా మేరకు బెంగళూరులోని సీఎంఐ ఆసుపత్రిలో చేరాడు. రెండు రోజుల పరీక్షల అనంతరం వైద్యులు అతనికి మూత్ర పిండాల సమస్య ఉందని, శస్త్రచికిత్స చేయాలని సూచించారు. రోగి అంగీకారంతో శస్త్రచికిత్స చేసి, స్టంట్ వేశారు. ఐదు రోజుల తర్వాత రోగిని ఇంటికి పంపుతూ 4 వారాల తర్వాత స్టంట్ తొలగించడానికి ఆసుపత్రికి రావాలని సూచించారు. ఈ మేరకు 2018 డిసెంబరు 12న రోగి భార్యతోపాటు ఆసుపత్రికి వెళ్లాడు. తిరిగి 28న రావాలని సూచించారు. 28న శస్త్రచికిత్స చేసి స్టంట్ తొలగించామని చెప్పారు. రోగి ఆరోగ్యపరిస్థితి కుదుట పడిందని చెప్పారు. రెండేళ్ల తర్వాత 2020 జులై 1న రోగికి కాలునొప్పి రావడంతో అదే ఆసుపత్రికి వెళ్లాడు. వైద్యులు పరీక్షించి తమ ఆసుపత్రిని కొవిడ్‌కు కేటాయించారని, తమకు అనుబంధంగా ఉన్న మరో ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. అక్కడ వైద్యులు పరీక్షించి స్టంట్ పొరపాటున మూత్రపిండంలో ఉండిపోయిందని తేల్చారు. ఎంఆర్ఐ స్కానింగ్ ద్వారా నిర్ధారించి, శస్త్రచికిత్స చేసి తొలగించారు. అనంతరం రోగి వాంతులతో బాధపడుతూ 2020 డిసెంబరు 21న మృతి చెందాడు. ఇదంతా వైద్యుల నిర్లక్ష్యమేనని ఆసుపత్రికి బాధితులు నోటీసులు పంపారు. ఆసుపత్రి వర్గాల నుంచి ఎలాంటి స్పందించలేదు. మృతుడి భార్య, పిల్లలు, తండ్రి కలిసి జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. కమిషన్ ఇరువర్గాల వాదనలను పరిశీలించింది. కేసు పూర్వాపరాలను పరిశీలించిన అనంతరం కమిషన్ ఇందులో ఇద్దరు వైద్యులను బాధ్యులు చేస్తూ సేవాలోపానికి రూ.10 లక్షలు, మనోవేదనకు రూ.20 వేలు, ఖర్చులకు రూ.5వేలు చెల్లించాలని ఆదేశించింది.

'పీఎంశ్రీ'తో బడుల రూపురేఖలు మారుద్దాం


జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: పీఎం శ్రీ (ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం ద్వారా కనీవినీ ఎరగని రీతిలో ఎంపికైన పాఠశాలల రూపురేఖలు మారుద్దామని, ప్రతి ఒక్కరూ ఉద్యమ తరహాలో కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ, ఎస్ఎస్ఏ, సమన్వయ శాఖల జిల్లా అధికారులతో పథకం నిర్వహణపై సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో మొత్తం 1,741 పాఠశాలలు ఉంటే.. ఇందులో తొలి విడతగా 42 ఎంపిక చేశారన్నారు.





మహావృక్షం నీడలో కొలువుదీరిన తిమ్మమాంబ

ఆధ్యాత్మిక, వైజ్ఞానిక సౌరభం తిమ్మమ్మ మఱ్రిమాను



విస్తరించిన మఱ్రిమాను కొమ్మలు, ఊడలు

చారిత్రక, ఆధ్యాత్మిక, వైజ్ఞానికపరంగా శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం ఎన్‌పీ కుంట మండలంలో తిమ్మమ్మ మఱ్రిమాను ఎంతో ప్రసిద్ధి. మఱ్రిమాను వయసు 500 ఏళ్లు. సుమారు 8 ఎకరాల్లో విస్తరించి ఉంది. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకుంది. చెట్లకొమ్మలు, ఊడలు విస్తరించిన ఈ ప్రాంతంలో స్మారకం, దేవాలయం ఉంది. మహాశివరాత్రికి ఇక్కడ పెద్ద స్థాయిలో ఉత్సవాలు జరుగుతాయి. వివాహం, సంతానం కోసం తిమ్మమాంబ ఆలయానికి విచ్చేసి ముడుపులు కడతారు. పెద్ద చెట్టు ఉన్నప్పటికీ ఒక పక్షి గూడు ఉండకపోవటం మరో విశేషం. ఐదేళ్లుగా వైకాపా పాలనలో కనీస సౌకర్యాలపై దృష్టి సారించకపోవడంతో మఱ్రిమాను ప్రాంతం ప్రాచుర్యాన్ని కోల్పోయింది. ఈ మహా వృక్షంను దర్శించుకునేందుకు తగిన రోడ్డు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తే నిత్యం పర్యాటకుల రాకకు మార్గం సుగమం అవుతుంది. కదిరి లక్ష్మీనరసింహస్వామి వద్దకు వచ్చే భక్తులకు ఇక్కడి విశేషాలను వివరించేలా చేస్తే నిత్యం పర్యాటకులు పోటెత్తడం ఖాయం.

- ఈనాడు, అనంతపురం, న్యూస్‌టుడే, కదిరి

నెట్టికంటయ్యా.. బృహత్తర ప్రణాళిక ఏదయ్యా!

● కసాపురం ఆలయ వార్షిక ఆదాయం రూ.10 కోట్లు

గుంతకల్లు, గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రసిద్ధి చెందిన కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు కష్టాలు తప్పడం లేదు. బృహత్తర ప్రణాళిక కార్యరూపం దాల్చకపోవడమే ఇందుకు కారణం. ఆలయానికి రోజూ 2 వేల మందికి పైగా భక్తులు వస్తుంటారు. ఏటా ఆదాయం రూ. 10 కోట్ల వరకు ఉంటోంది. ఆస్థాయిలో భక్తులకు సౌకర్యాలు కల్పించడం లేదన్న విమర్శలున్నాయి. పదేళ్ల కిందటే బృహత్తర ప్రణాళికను రూపొందించారు. దీన్ని అప్పటి ప్రభుత్వం ప్రైవేట్ కంపెనీ సాయంతో రూపొందించింది. సదరు కంపెనీ రెండేళ్ల కిందట వైకాపా ప్రభుత్వానికి పూర్తి స్థాయి నివేదికను అందజేసింది. సదరు ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేయడంలో తీవ్ర జాప్యం చేసింది. ఆమోదించి ఉంటే ఈపాటికి పనులు ప్రారంభమయ్యేవని భక్తులు అంటున్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం భక్తులకు శాపంగా మారింది.

ప్రణాళికలోని అంశాలివిగో..

● ఆలయం ముందున్న దుకాణాలు, గదులను తొలగిస్తే భక్తులకు సౌకర్యంగా విడిది కేంద్రాలను నిర్మించడానికి అవకాశం ఉంటుంది.

● భక్తులు స్నానాలు చేయడానికి ప్రత్యేక పుష్కరిణి, అధునాతన సౌకర్యాలతో మరుగుదొడ్లు, స్నానాల గదుల నిర్మాణం.

● ఆలయ పరిసరాల్లో విశాలమైన రహదారులు, ఉద్యానాలు, గోశాల, అన్నదాన సత్రం, క్యూలైన్లు, శుద్ధజల కేంద్రం, ప్రాకార నిర్మాణం తదితరాలను ప్రణాళికలో పొందుపరిచారు.



భక్తులు వినియోగించని పుష్కరిణి

అడుగడుగునా ఇబ్బందులే...

ఆలయానికి వచ్చే వేలాది మంది భక్తులు అరగంటకు మించి ఉండటానికి ఎలాంటి సౌకర్యాలు లేవు. గతంలో ఏర్పాటు చేసిన పార్కులు ఉనికి లేకుండా పోయాయి. ప్రస్తుతం ఆ పార్కుల స్థలంలో చెత్త నిల్వ కేంద్రాలుగా మారాయి. ఆలయంలో 60 వసతి గదులను ఐదేళ్ల కిందటే కాలం చెల్లాయని వినియోగించడం లేదు. వాటి స్థానంలో కొత్తవాటిని నిర్మించలేదు. వర్షం వస్తే ఆలయ పరిసరాల్లో నీరు నిలబడుతోంది. ఉత్సవాలను నిర్వహించేందుకు విశాలమైన స్థలం లేకపోవడం భక్తులను బాధిస్తోంది.

త్వరలో ప్రణాళికకు ఆమోదం...

- మల్లికార్జున, సహాయ కార్యనిర్వహణాధికారి

భక్తులకు సౌకర్యాలు కల్పించానికి ఉద్దేశించిన బృహత్తర ప్రణాళికకు త్వరలో ప్రభుత్వ ఆమోదం లభించనుంది. ప్రస్తుతం ప్రణాళికలను పరిశీలించడానికి రాష్ట్ర స్థాయిలో కమిటీని ఏర్పాటు చేసింది. కసాపురం ఆలయ బృహత్తర ప్రణాళిక త్వరలో కమిటీ ముందుకు రానుంది.




కసాపురం ఆలయం



లావణ్య ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బాధితురాలి బంధువులు

నిబంధనలు చూడరు.. అనుమతులు ప్రశ్నించరు!

ప్రైవేట్ ఆసుపత్రుల దందా



న్యూస్‌టుడే, అనంతపురం (వైద్యం)

● ఈనెల 20న అనంతపురం సంగమేశ్‌నగర్‌లో విశ్రాంత వైద్యురాలు అనుమతి లేకుండా ఇంట్లో క్లినిక్ నిర్వహిస్తోన్న విషయం వెలుగులోకి వచ్చింది. విద్యార్థి ప్రవీణ్‌కుమార్ జ్వరం వస్తోందని వెళితే వైద్యురాలు పరీక్షించి మందులు రాసిచ్చింది. ఆమె కాకుండా భర్త విద్యార్థికి ఇంజెక్షన్ వేయటంతో వికటించి కుడికాలు తొడభాగం ఇన్‌ఫెక్షన్‌కు గురైంది. డీఎంహెచ్‌వోతోపాటు అధికారులు అక్కడికి వెళ్లి క్లినిక్‌కు అనుమతులు లేవని గుర్తించారు. అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

● అనంతపురం రామచంద్రానగర్‌లో ఓ ప్రభుత్వ వైద్యుడు తాను సొంతంగా నిర్వహిస్తున్న క్లినిక్‌లో రాధ అనే వివాహితకు గర్భ సంచి సర్జరీ చేశారు. సర్జరీ చేసే సమయంలో మూత్రనాలలను కత్తిరించటంతో ఆ వివాహితకు మూత్రం రాని పరిస్థితి ఏర్పడింది. బంధువులందరూ వెళ్లి ఆసుపత్రి ఎదుట ఆందోళన చేయడంతో విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లింది. సదరు ఆసుపత్రి వద్దకు వెళ్లి పరిశీలించాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. ఆమె బాధితులతో మాట్లాడారు. క్లినిక్‌లో ఓపీ సేవలు అందించాల్సి ఉండగా సదరు వైద్యురాలు ఏకంగా ఆసుపత్రి అని బోర్డు పెట్టుకున్నారు. అక్కడ శస్త్రచికిత్సలు సైతం చేస్తున్నట్లు గుర్తించారు. సంబంధిత ఆసుపత్రికి అధికారులు నోటీసులు జారీ చేశారు. ఆసుపత్రిని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో అధికారులు కళ్ల ముందే నిబంధనలు పాటించలేదని స్పష్టంగా తెలుస్తున్నా ఆసుపత్రిని ఎందుకు సీజ్ చేయలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అడిగేవారెవరు?

అనంతపురంలోనే 60 నుంచి 80 వరకు ప్రథమ చికిత్సా కేంద్రాలు (ఆర్ఎంపీ) ఉన్నాయి. ఇక్కడికి వచ్చే రోగులకు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి. అయితే ఇక్కడి ఆర్ఎంపీలు పడకలు ఏర్పాటు చేసుకోవడం, రోగులకు సూది మందులు వేయడం, సెలైన్లు ఎక్కించడం, మందులు చీటీలు రాయడం, ఆపరేషన్లు చేయడం వంటి నిర్భీతిగా చేసేస్తున్నారు. ఇంత జరుగుతున్నా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

● అనంతపురంలో ఎక్కడ చూసినా అనుమతులు లేకుండానే ప్రైవేట్ వైద్యశాలలు పెద్ద ఎత్తున ఏర్పాటు అవుతున్నాయి. పరిశీలించాల్సిన డీఎంహెచ్‌వో కార్యాలయ డెమో విభాగం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నెలవారీ తనిఖీల ఊసేలేదు.

● ఇటీవల అనంతపురం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఆసుపత్రుల నిర్వహణ లోపాలపై నోటీసులు జారీ చేసి వదిలేశారు. తర్వాత ఎలాంటి చర్యలు ఉండటం లేదు. కాసులు చేతులు మారినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కొన్ని సంఘటనల్లో ఫిర్యాదు చేసిన రోగులు, వారి బంధువులతో వచ్చి ఆసుపత్రుల యాజమాన్యాలతో ఒప్పందం చేసుకుంటూ ఫిర్యాదులను వెనక్కి తీసుకుంటున్నారు. విచారణ కమిటీని వేస్తున్నారు. నివేదికలు కలెక్టర్, డీఎంఈకి పంపుతున్నామని చెబుతున్నారే తప్ప చర్యలు శూన్యం.

కచ్చితంగా చర్యలు ఉంటాయ్

- ఈ.బి.దేవి, డీఎంహెచ్‌వో

ప్రైవేట్ ఆసుపత్రులను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నాం. నిబంధనలు పాటించని ఆసుపత్రులపై కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. రాయదుర్గంలో పరిశీలించి నిబంధనలు పాటించని ఆసుపత్రులకు నోటీసులు ఇచ్చాం. వారు సంజాయిషీ ఇచ్చారు. మరోసారి సదరు ఆసుపత్రులను తనిఖీ చేసి చర్యలు తీసుకుంటాం. అనంతపురంలో పలు ఆసుపత్రులకు నోటీసులు ఇచ్చాం. విద్యార్థికి వైద్యం అందించిన విశ్రాంత వైద్యురాలికి నోటీసులిచ్చాం.. లావణ్య ఆసుపత్రిని సీజ్ చేస్తాం.

పామిడిలో యథేచ్ఛగా ఇసుక రవాణా

పామిడి, న్యూస్‌టుడే : పామిడి పెన్నాపరివాహక ప్రాంతం ఇసుక అక్రమ రవాణాదారులకు వరంగా మారింది. యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా పట్టించుకునేవారే కరవయ్యారు. కొన్ని రోజుల కిందట ఇసుకను తరలిస్తున్న ఎడ్లబండ్లపై అధికారులు జరిమానా విధించడంతో ఇసుక అక్రమ రవాణా విషయం చర్చనీయాంశమైంది. కొందరు ట్రాక్టర్లతో, మరి కొందరు టిప్పర్లతో రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న అధికారులు పట్టించుకోలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెన్నాపరివాహక ప్రాంతంలోని ఓ వ్యక్తి తన పట్టా భూమిలో యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై పామిడి సీఐ యుగంధర్‌ను వివరణ కోరగా ఇసుక అక్రమ రవాణా జరుగకుండా నిఘా ఉంచాం. పోలీసుల పర్యవేక్షణలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



పట్టపగలే టిప్పర్లలో ఇసుక నింపుతున్నారిలా..

కియాలో ఉద్యోగ అవకాశాలు కల్పించండి



కియా ప్రతినిధులతో చర్చిస్తున్న జేఎన్‌టీయూ ఇన్‌ఛార్జి వీసీ సుదర్శనరావు

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: కియా కార్ల పరిశ్రమలో జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని జేఎన్‌టీయూ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య సుదర్శన రావు విజ్ఞప్తి చేశారు. కియా ప్రతినిధులు హాంగ్‌సంగ్ పార్క్, హంగుకిమ్, శ్రీహాన్, ఉమాశంకర్ పట్నాయక్, రమేష్‌బాబు, విజయపాయ్ బుధవారం జేఎన్‌టీయూను సందర్శించారు. సీమెన్స్ ప్రయోగశాలలను పరిశీలించారు. అనంతరం ఇన్‌ఛార్జితో సమావేశమయ్యారు. వీసీ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు కియా పరిశ్రమలో ఇంటర్న్‌షిప్ చేయడానికి అవకాశం కల్పించాలన్నారు. ఇంజినీరింగ్ కోర్సులు పూర్తి చేసిన వారికి ఉద్యోగాలు కూడా ఇవ్వాలన్నారు. అధ్యాపకులు, ఆచార్యులు, విద్యార్థులు కియా పరిశ్రమ సందర్శించడానికి అవకాశాలు కల్పించాలన్నారు. జేఎన్‌టీయూ, కియా పరస్పర సహకారంతో పనిచేయడానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దబ్బచిక్కుడు.. రైతు కంట నీరు

- ఎకరాకు రూ.40 వేలు పెట్టుబడి
- అమాంతంగా పడిపోయిన ధర

పెద్దపప్పూరు, తాడిపత్రి పట్టణం, న్యూస్‌టుడే : గత ఏడాది కాసుల వర్షం కురిపించిన దబ్బచిక్కుడు పంట ప్రస్తుతం రైతు కంట నీరు పెట్టిస్తోంది. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా ఇక్కడ పంట సాగవుతుంది. ఆరు నెలల శ్రమించి పంట సాగు చేస్తే కనీసం పెట్టుబడులు కూడా దక్కడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. గతేడాది కిలో రూ. 60 నుంచి రూ. 70 వరకు పలికిన ధర ప్రస్తుతం కనీస గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

దిగుబడి ఉన్నా..

తాడిపత్రి నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 200 ఎకరాల్లో దబ్బచిక్కుడు పంట సాగులో ఉంది. ఎకరాకు రూ.40 వేలు పెట్టుబడి పెట్టి బిందు సేద్యం ఆధారంగా సాగు చేపట్టారు. గత నెల నుంచి పంట చేతికి వస్తోంది. దబ్బచిక్కుడు పంటకు తమిళనాడు రాష్ట్రంలోని చెన్నై మార్కెట్‌లో మాత్రమే మంచి డిమాండ్ ఉంటుంది. స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేక రైతులు నేరుగా పంటను చెన్నై మార్కెట్‌కు తరలిస్తున్నారు. కిలో రూ.10 మాత్రమే పలుకుతుండడంతో రవాణా ఖర్చులు, మార్కెట్ కమీషన్, కూలీల ఖర్చులు పోను పైసా చేతికి దక్కడం లేదని రైతులు వాపోతున్నారు. ధర పెరుగుతుందనే ఆశతో పంటను పొలంలో వదిలేయలేక పెట్టుబడులు రాకపోయినా మార్కెట్‌కు తరలిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. అధికారులు స్పందించి స్థానికంగా మార్కెట్ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉంది.



పెద్దపప్పూరు: సాగులో ఉన్న దబ్బచిక్కుడు పంట



మార్కెట్‌కు తరలిస్తున్న రైతులు

చేతి నుంచే కూలీలకు చెల్లిస్తున్నా



రెండెకరాల్లో దబ్బచిక్కుడు పంట సాగు చేశా. రూ.80 వేల వరకు పెట్టుబడి వచ్చింది. నెల రోజుల నుంచి పంట చేతికి వస్తోంది. కిలో ధర రూ.10 వరకే ఉంది. కూలీలకు చేతి నుంచి చెల్లిస్తున్నా. అధికారులు గిట్టుబాటు ధర దక్కేలా చూడాలి.

- గౌస్, రైతు, పెద్దపప్పూరు

అధికారులతో చర్చించి న్యాయం చేస్తాం

తమిళనాడు రాష్ట్రంలో మాత్రమే దబ్బచిక్కుడు పంటను ఎక్కువగా వినియోగిస్తారు. స్థానికంగా వినియోగించేవారు లేకపోవడంతో రైతులంతా చెన్నై మార్కెట్‌కు దిగుబడిని తరలిస్తున్నారు. ఒకే మార్కెట్‌కు పంట అధికంగా పోవడంతో ధరలు తగ్గాయి. తమిళనాడు మార్కెట్లలో పరిస్థితులను తెలుసుకొని ఉన్నతాధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటాం. **-ఉమాదేవి, ఉద్యానశాఖ అధికారిణి**

పరిశ్రమల శాఖలో బదిలీలు

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: ఉమ్మడి అనంత జిల్లా పరిశ్రమల శాఖలో బదిలీలు జరిగాయి. అనంత జీఎం నాగరాజారావును అనకాపల్లికి, అక్కడి పని చేస్తున్న జి.ఎం.శ్రీధర్‌ను అనంత జిల్లా పరిశ్రమల అధికారిగా బదిలీ చేశారు. శ్రీసత్యసాయి జిల్లా డీఐసీ చాంద్‌బాషాను కడపకు, పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్న జె.నాగరాజును శ్రీసత్యసాయికి బదిలీ చేశారు. వీరందరూ అక్టోబరు తొలి వారంలో రిలీవ్ అయి... కొత్త స్థానాల్లో చేరే అవకాశం ఉంది. ఇదే క్రమంలో అనంత జిల్లా పరిశ్రమల కార్యాలయ పర్యవేక్షకుడు వి.మునినాథుడుని చిత్తూరుకు బదిలీ చేయగా.. కర్నూలు నుంచి డి.రామాంజినమ్మను అనంత కార్యాలయానికి బదిలీ చేశారు. అనంత డీఐసీలోని ఐపీఓలు వి.సుజనను నంద్యాలకు, జేపీ దుర్గేస్‌ను శ్రీసత్యసాయికి బదిలీ అయ్యారు. వీరి స్థానాల్లోకి నంద్యాలలో పని చేస్తున్న పి.రవీంద్రనాథ్‌రెడ్డి, అన్నమయ్య జిల్లాలో పని చేస్తున్న భువనేశ్వరి, వి.నిశాంత్‌లను అనంత డీఐసీకి రానున్నారు.

బాధిత రైతు కుటుంబానికి రూ.లక్ష పరిహారం

పామిడి, న్యూస్‌టుడే : పామిడిలోని బొడ్రాయి వీధిలో నివాసమంటున్న రైతు సూర్యనారాయణ కలెక్టరేట్ కార్యాలయంలో ఆత్మహత్యయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ రైతు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం పామిడి తహసీల్దారు కార్యాలయంలో మృతుడి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరపున రూ.లక్ష చెక్కును అందజేశారు. భూమి ఆధారాలు పరిశీలించి మృతుడి కుటుంబ సభ్యుల పేరిట పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పామిడి తహసీల్దారు శ్రీధర్‌మూర్తి, గార్లదిన్నె తహసీల్దారు ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.



మృతుడి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ

ఖరీఫ్, రబీ బీమా ప్రకటించాలి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: గడిచిన ఖరీఫ్, రబీ పంటలకు బీమాను సత్వరమే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ ముందు నిరసన తెలిపారు. తొలుత అనంత నగరంలో ర్యాలీ చేశారు. రెండు రోజుల క్రితం మృతి చెందిన పామిడి సూర్యనారాయణ చిత్రపటాన్ని చేతబూని నిరసనలో పాల్గొన్నారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యక్షుడు తరిమెల నాగరాజు, కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి బాల రంగయ్య మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో గత ఖరీఫ్, రబీ పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీనికి ఏమాత్రం పరిహారం ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం సత్వరమే బీమా ప్రకటించాలని కోరారు. అతివృష్టి, అనావృష్టి కారణంగా వేరుసెనగ, పప్పు శెనగ, మిరప, పత్తి, ఆముదం, జొన్న, కొర్ర, మొక్కజొన్న, సజ్జ, ప్రొద్దు తిరుగుడు.. వంటి పంటలు దిగుబడి రాలేదన్నారు. 2023లో ఖరీఫ్‌లో 18, రబీలో 14 మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించారని గుర్తు చేశారు. సత్వరమే తగిన సాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత రైతు సూర్యనారాయణ కుటుంబానికి రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలన్నారు. దీనికి బాధ్యులైన వీఆర్‌ఓ మధును సస్పెండ్ చేయాలన్నారు. ఆ తర్వాత డీఆర్‌ఓకు వినతి అందజేశారు. ఈ నిరసనలో రైతు సంఘం నాయకులు శివారెడ్డి, విరుపాక్షి, రాజారాం, నల్లప్ప, పోతులయ్య, కుళ్లాయప్ప, మల్లికార్జున పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట రైతుల నిరసన



ఎంపికైన అండర్-17 ఫుట్‌బాల్ బాలికల జట్టు



బాలుర జట్టు

ఫుట్‌బాల్ బాలబాలికల జట్ల ఎంపిక

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడల అంతర్ జిల్లా ఫుట్‌బాల్ పోటీల్లో అండర్-17 బాలబాలికల జట్లను బుధవారం ఎంపిక చేశారు. ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహించి అందులో ప్రతిభ చూపిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులను తుది జట్లకు ఎంపిక చేశారు. ఎంపికైన జట్లు ఈ నెల 28 ఉంచి పల్నాడు జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయి. ఎంపిక పోటీల ప్రారంభోత్సవానికి పాఠశాల క్రీడల సమాఖ్య అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల కార్యదర్శులు బి.సుగుణమ్మ, మొరార్జీ యాదవ్‌లు అతిథులుగా హాజరయ్యారు. సెలెక్షన్ కమిటీ సభ్యులుగా లోకనాథ్, ప్రకాశ్‌రెడ్డి, దాదా ఖలందర్‌లు వ్యవహరించారు.

జట్ల వివరాలు ఇలా...

బాలికల జట్టు: ప్రణతి, వర్ష, అఖి, అక్షిత, హాసిని, శిల్పా, యామిని, స్వాతి, హర్షవల్లి రూప, మన్విత, పూజిత, రమ్య, పూజిత, భార్గవి, యశస్విని, భవ్యశ్రీ. **బాలుర జట్టు:** సుధీర్, తన్విత్, పవన్, జశ్వంత్, శ్రీహరి, యశ్వంత్‌కుమార్, ఆదిత్య, హేమంత్, నవీన్, రితిక్‌రెడ్డి, కేసీ యోగేష్, పునీత్‌కుమార్, బి.ధనూష్‌కుమార్.

రథం ఘటనలో హెడ్‌కానిస్టేబుల్ పాత్రపై విచారణ జరపాలి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గం, న్యూస్‌టుడే: కణేకల్లు మండలం హనకనహాళ్‌లో శ్రీరాముడి రథం దహనం కేసులో హెడ్‌కానిస్టేబుల్ రఘునాథరెడ్డి పాత్రపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్పీ జగదీశ్‌ను ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. శ్రీరాముడి రథం దహనం కేసులో బోడిమల్ల ఈశ్వరరెడ్డికి సమీప బంధువు హెడ్‌కానిస్టేబుల్ రఘునాథరెడ్డి పాత్ర ఖచ్చితంగా ఉందని తనకు, గ్రామస్థులకు అనుమానం ఉందన్నారు. రథానికి నిప్పుపెట్టడం ఒక వ్యక్తితో కాదని, ఇంకా నలుగురు ఉంటారనే అనుమానాలు గ్రామస్థులు వ్యక్తం చేస్తున్నారని, ఆ కోణంలో దర్యాప్తు చేపట్టాలన్నారు. హెడ్‌కానిస్టేబుల్ రఘునాథరెడ్డి మంగళవారం ఎందుకు వచ్చారో విచారణ జరిపించాలన్నారు. రఘునాథరెడ్డి కణేకల్లులో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేసే సమయంలో వైకాపా నాయకులకు కొమ్ము కాసి, తెదేపా నాయకులపై అనేక తప్పుడు కేసులు పెట్టి వేధించాడన్నారు. ఒక వాలంటీర్ పాత్రపై అనుమానాలను గ్రామస్థులు వ్యక్తం చేస్తున్నారన్నారు. నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా నాగమద్దయ్య

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారులను బదిలీ చేసింది. అందులో భాగంగా ఉమ్మడి జిల్లాకు డిప్యూటీ కమిషనర్‌గా పి.నాగమద్దయ్యను నియమించారు. ఈయన సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీసీగా విజయవాడ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహించేవారు. అసిస్టెంట్ కమిషనర్‌గా విజయవాడలోని డిస్టిలరీస్ ఏసీగా పనిచేస్తున్న జి. మునిస్వామి రానున్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా నంద్యాల సెబ్‌లో పనిచేస్తున్న బి.రామ మోహన్‌రెడ్డిని నియమించారు.

సాంకేతిక సాగుతో ఖర్చులు తగ్గించుకోవచ్చు

కుందుర్పి, న్యూస్‌టుడే: ఆధునిక సాంకేతిక వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తూ రైతులు పంటల సాగుతో ఖర్చులు తగ్గించుకోవచ్చని జాతీయ వ్యవసాయ పరిశోధన విద్యాశాఖ మాజీ కార్యదర్శి ఐసీఏఆర్ మాజీ డైరెక్టర్ జనరల్ పంజాబ్ సింగ్ పేర్కొన్నారు. ఐసీఏఆర్, సీఆర్ఐడీఏ ప్రాజెక్ట్ సంస్థ బృంద సభ్యులు బుధవారం మండలంలోని తమ్మయ్యదొడ్డిలో ప్రకృతి వ్యవసాయ పంటలు, నీటి కుంటలు, ఉపకరణాలను పరిశీలించారు. ఏఎఫ్ ఎకాలజీ సంస్థ సహకారంతో రైతులు సాగుచేసిన వ్యవసాయ పద్ధతులను బృంద సభ్యులకు వివరించారు. కరవు పరిస్థితులకు తట్టుకునేలా విత్తనాలు వాడాలన్నారు. వర్షాలు రానప్పుడు ప్రత్యామ్నాయంగా రక్షక తడులుతో అందించే విధానంపై తెలిపారు. ఇతర చోట్ల పంటల సాగు వివరాలను చిత్రతెరల ద్వారా చూపించారు. రేకులకుంట వ్యవసాయ ముఖ్య శాస్త్రవేత్తలు విజయ్, శంకర్‌బాబు, ఆంగ్రియా డైరెక్టర్ సత్యనారాయణ, జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ, నేషనల్ కోఆర్డినేటర్ రామసుందరం, ఏఎఫ్ ఎకాలజీ ముఖ్య అధికారి మురళీకృష్ణ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



నీటి కుంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కంటైనర్‌లో మంటలు

పెనుకొండ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ శివారులోని పులేకమ్మ ఆలయ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఎలక్ట్రానిక్స్ స్క్రాప్‌తో వెళుతున్న కంటైనర్‌లో బుధవారం మంటలు వ్యాపించాయి. డ్రైవర్ వివరాల మేరకు.. తమిళనాడు నుంచి దిల్లీకి ఎలక్ట్రానిక్స్ స్క్రాప్‌తో వెళుతుండగా కంటైనర్‌లో పొగలు వచ్చాయి. వెనక వచ్చిన ఓ లారీ డ్రైవర్ గమనించి చెప్పడంతో వాహనాన్ని ఆపేశారు. అందులో ఉన్న పాత ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ స్క్రాప్‌కు మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పివేశారు. రూ.80వేలు విలువచేసే సామగ్రి దగ్ధమైనట్లు ఆశాఖ అధికారులు తెలిపారు.



హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

అనంతపురం(లీగల్): జిల్లా కేంద్రంలో జరిగిన మొలక దేవేంద్ర హత్య కేసులో నిందితుడు లక్ష్మీనారాయణకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధిస్తూ ఏడో అదనపు సెషన్స్, కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి టి.హరిత బుధవారం తీర్పు వెలువరించారు. రుద్రంపేటకు చెందిన మొలక దేవేంద్ర, అతని భార్య లక్ష్మీదేవిలు సవీరా ఆసుపత్రిలో పనిచేస్తూ జీవనం సాగించేవారు. వీరి ఇంటి పక్కనే లక్ష్మీనారాయణ నివాసం ఉంటున్నాడు. గతంలో దేవేంద్ర.. లక్ష్మీనారాయణ భార్యను దుర్భాషలాడాడు. అది మనస్సులో పెట్టుకొని 2021 నవంబరు 11న దేవేంద్ర, అతని భార్య లక్ష్మీదేవి ఇంట్లో ఉండగా లక్ష్మీనారాయణ వారి ఇంట్లోకి ప్రవేశించి దేవేంద్రను కింద పడేసి కొట్టసాగాడు. అదే క్రమంలో భార్య అడ్డు వస్తే తోసేశాడు. పక్కనే ఉన్న పునాదిరాయిని తలపై వేసి దేవేంద్రను చంపేశాడు. వీధిలో ఉన్నవారు అప్రమత్తమై అక్కడికి వచ్చే సరికి పారిపోయాడు. అప్పటి నాలుగో పట్టణ సీఐ కత్తి శ్రీనివాసులు కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టి అభియోగ పత్రాలను కోర్టుకు అందజేశారు. కోర్టు పది మంది సాక్షులను విచారించింది. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగరాజ బాబు వాదనలు వినిపించారు. నిందితుడిపై నేరారోపణ రుజువు కావడంతో యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. సీఐ కత్తి శ్రీనివాసులు, కోర్టు మానిటరింగ్ అధికారి శ్రీనివాసులు, సునీల్ కుమార్‌లను ఎస్పీ జగదీశ్ అభినందించారు.

భార్యను చితకబాది.. భర్త ఆత్మహత్య

గుత్తి, న్యూస్‌టుడే : తనకు దూరంగా ఉంటున్న ఓ భార్యపై భర్త కర్రతో విచక్షణారహితంగా కొట్టి.. తాను ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య చావుబతుకుల మధ్య ఆసుపత్రిలో చికిత్సపొందుతోంది. గుత్తి మండలంలోని అబ్బేదొడ్డి గ్రామానికి చెందిన గోపాల్(40) యాడికి మండలానికి చెందిన సుమలతతో పదేళ్ల కిందట వివాహం జరిగింది. కొంతకాలం తరువాత ఇద్దరి మధ్య విభేదాలొచ్చాయి. ఈక్రమంలో భార్య భర్తకు దూరంగా యాడికిలో ఉంటోంది. భర్త తల్లికి ఆరోగ్యం బాగలేకపోవడంతో చూసేందుకు శనివారం వచ్చింది. దీంతో ఆగ్రహించిన గోపాల్ ఆమె తలపై కర్రతో బాదాడు. ఈఘటనతో ఆమె కోమాలోకి వెళ్లింది. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె చనిపోతే తనకు ఇబ్బందులు తప్పవని భావించిన భర్త బుధవారం గుత్తిశివారులోని తురకపల్లి రైల్వే వంతెన వద్ద రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని గుత్తి ఆసుపత్రికి తరలించి పంచనామా చేశారు.

కేతిరెడ్డి వాహన డ్రైవర్ అరెస్టు

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని సబ్‌జైలు కూడలి వద్ద ఈ నెల 23న భాజపా కార్యకర్త ప్రతాప్‌రెడ్డిని కారుతో ఢీకొట్టిన కేసులో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వాహన డ్రైవర్ రామాంజనేయులును బుధవారం 1వ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. పెనుకొండ కోర్టులో రామాంజనేయులును పోలీసులు హాజరుపరిచారు. కోర్టు అతడికి రిమాండ్‌కు ఆదేశించింది.

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

‘కుట్రపూరిత రాతలు సిగ్గుచేటు’

కణేకల్లు: హనకనహాళ్‌లో రథానికి నిప్పంటించిన ఘటనలో వైకాపాకు చెందిన కుట్రపూరిత రాతలు సిగ్గుచేటని తెదేపా మండల కన్వీనర్ లాలెప్ప, నాయకులు మల్లికార్జున, నాగార్జున విమర్శించారు. బుధవారం తెదేపా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వచ్చిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. వైకాపా నాయకుల ప్రోద్బలంతో ఘటన జరిగినప్పటికీ తెదేపాకు ఆపాదించేలా రాతలు రాయడం కుట్రపూరితమని ఆందోళన వ్యక్తం చేశారు. నిందితుడు వైకాపా మాజీ ఎమ్మెల్యే గురున్నాథరెడ్డి సోదరులు ఎర్రిస్వామిరెడ్డి, రెడ్డెప్పరెడ్డిలకు మనవడు అవుతాడని తెలిపారు. మూడేళ్ల క్రితం రథం నిలిపే స్థలం విషయమై ఎవరు వివాదం సృష్టించారనే విషయం గ్రామమంతా కోడై కూస్తోందని, జాగిలం వైకాపా నాయకుల ఇళ్ల చుట్టూ తిరిగిందని, ఇన్ని ఆధారాలు ఉన్నప్పటికీ పత్రికా స్వేచ్ఛను అపహాస్యం చేసేలా అబద్ధపు రాతలు చూసి ప్రజలంతా నవ్వుకొంటున్నారని ఎద్దేవా చేశారు.

ముగిసిన మండలస్థాయి క్రీడా పోటీలు

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో మండల స్థాయి క్రీడా పోటీలు బుధవారం నిర్వహించారు. అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నికాయిట్ తదితర ఆటల పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. - న్యూస్‌టుడే, బృందం



కుందుర్పి: ఖోఖో ఆడుతున్న విద్యార్థినులు

నేడు మంత్రి సవిత రాక

కణేకల్లు, న్యూస్‌టుడే: రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు గురువారం కణేకల్లులో పర్యటించనున్నట్లు తెదేపా మండల కన్వీనర్ లాలెప్ప తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై వంద రోజులు పూర్తి చేసుకొన్న సందర్భంగా ‘ఇది మంచి ప్రభుత్వం’ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. మండలంలోని తెదేపా శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం

రాయదుర్గం, న్యూస్‌టుడే: రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించబడిన పొరాళు పురుషోత్తంను బుధవారం తెదేపా నాయకులు సన్మానించారు. నాయకులు కోదండరాముడు, వెంకటస్వామినాయుడు, ప్రవీణ్, మహేష్ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర చోరుల అరెస్టు

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: మొళకాల్మూరు పోలీసు ఠాణా అధికారులు ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.20 లక్షల విలువైన టిప్పర్, టాటా సుమో, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొన్నట్లు చెళ్లకెర డీవైఎస్పీ రాజణ్ణ తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల మేరకు. . ఉరవకొండకు చెందిన సహోదరులు మహేశ్, ప్రభాకర్‌ను అరెస్టు చేశారు. ఈ నెల 12న రాత్రి మొళకాల్మూరు గుత్తేదారు గోవిందరాజ్‌కు చెందిన రూ.12 లక్షల విలువైన టిప్పర్ లారీని దుండగులు చోరీ చేశారు. ఈ సంఘటనపై బాధితుడు పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసులు చోరీకి గురైన టిప్పర్‌ను సరిహద్దున ఉన్న ఉరవకొండ వద్ద పొలంలో దాచినట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు మహేశ్, ప్రభాకర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా.. వారు అందించిన సమాచారం మేరకు కొప్పళలో చోరీ చేసిన రూ.6.20 లక్షల విలువైన టాటా సుమో, రూ.1.80 లక్షల విలువైన ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు హొసపేటలో టిప్పర్ లారీల డ్రైవర్లుగా పనిచేసిన అనుభవంతో చిత్రదుర్గం, బళ్లారి, కొప్పళ, దావణగెర, హావేరి, విజయనగర, అనంతపురం జిల్లాలో పలుచోట్ల వాహనాలను చోరీ చేసి విక్రయించేవారన్నారు. బళ్లారి కౌల్‌బజార్ పోలీసు ఠాణా పరిధిలో నమోదైన వాహనాల చోరీ కేసులో పోలీసులకు పట్టుబడిన నిందితులు జైలుశిక్ష అనుభవించి బయట పడినట్లు చెప్పారు. జైలు నుంచి విడుదలైన తర్వాత తమ చోరీ వృత్తిని కొనసాగించారన్నారు. నిందితులను అరెస్టు చేసిన ఇన్‌స్పెక్టర్ వసంత ఆసాదే, పీఎస్ఐ పాండురంగ, నేర నియంత్రణ విభాగం పీఎస్ఐ ఈరేశ్ తదితరులను జిల్లా ఎస్పీ రంజిత్ కుమార్ బండారు అభినందించారు.

ఆధారాల కోసం పోలీసుల గాలింపు

కణేకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని హనకనహాళ్‌లో రామాలయ రథానికి నిప్పంటించిన ఘటనకు సంబంధించి నిందితుడు బొమ్మిరెడ్డి ఈశ్వర్‌రెడ్డి ఉపయోగించిన వస్తువుల కోసం పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడు వైకాపా మాజీ ఎమ్మెల్యే గురున్నాథరెడ్డికి స్వయానా మనవడు కావడం గమనార్హం. స్వయంగా జిల్లా ఎస్పీ జగదీశ్ ఈ కేసు దర్యాప్తులో నిందితుడు నేరం అంగీకరించడంతో అరెస్టు చేశారు. రథం షెడ్డుకు తలుపును వేసిన తాళం కోయడానికి ఉపయోగించిన బ్లేడు, రథంపై చల్లడానికి తీసుకొచ్చిన పెట్రోలు క్యాను పరిసర ప్రాంతాల్లో పడేశానని చెప్పడంతో బుధవారం గ్రామంలో పోలీసులు గాలింపు చేపట్టారు. పోక్లెయిన్ సాయంతో ముళ్లపొదలు తొలగించి వస్తువుల కోసం గాలించారు.

అద్దె భవనంలో అగ్నిమాపక కేంద్రం

● ఆరుబయటే వస్తువులు, ఏకరూప దుస్తులు

● సొంత గదుల నిర్మాణం జరిగేనా?

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం అగ్నిమాపక కేంద్రానికి సొంత భవనం లేక సిబ్బంది గత 37 ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలతో పాటు ఉరవకొండ నియోజకవర్గంలోని బెళుగుప్ప మండలం ఉంది. సుమారు 198 గ్రామాలు అగ్నిమాపక కేంద్రం పరిధిలోకి వస్తాయి.

● అగ్నిమాపక అధికారితో పాటు ఎల్ఎఫ్‌లు ఇద్దరు, డ్రైవర్లు ముగ్గురు, ఫైర్ మెన్లు 9 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఎంపీడీవో కార్యాలయంలోని తాత్కాలిక గదిలోనే అగ్నిమాపక అధికారి ఛాంబర్, స్టోర్ రూం, వాహనానికి సంబంధించిన పరికరాలు, ప్రమాదాల నివారణకు చెందిన వస్తువులు ఉంటాయి.



రేకుల షెడ్డులో విశ్రాంతి గది

● సిబ్బంది యూనిఫారాలు, బూట్లు, ఇతర వస్తువులను గది బయట పెట్టెలో ఉంచుకున్నారు. చిన్నపాటి వర్షాలకే వస్తువులు, దస్త్రాలు తడిసిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఆరుబయటే రేకులషెడ్‌లో సేదతీరాల్సిన దుస్థితి నెలకొంది.

● సొంత భవనం నిర్మాణానికి పట్టణ సమీపంలోని కురుకుంతకు, కంబదూరు బైపాస్‌లో టమాటా మండి వద్ద స్థలాలను అగ్నిమాపక శాఖ సంచాలకులు జయరామానాయక్ పరిశీలించిన ప్రయోజనం లేకపోయింది. ప్రస్తుతం కంబదూరు మార్గంలోని కృషి విజ్ఞాన కేంద్రం వద్ద 65 సెంట్ల స్థలాన్ని రెవెన్యూ వారు కేటాయించారు.

● ఈ విషయాన్ని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసరెడ్డిని వివరణ కోరగా.. గతంలో ఉన్న స్థలాల్లో సమస్యలు వచ్చాయి. నూతన భవన నిర్మాణానికి రూ. 2.02 కోట్లు మంజూరైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అనుమతులు వచ్చిన వెంటనే నిర్మాణ పనులు చేపడుతామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

రాయదుర్గం పట్టణం: 9666888046, కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661, ఉరవకొండ: 8008573071

సమస్య: చంద్రప్ప బావి వద్ద ఉన్న పశువుల నీటితొట్టి పరిసర ప్రాంతంలో నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. **- రామాంజనేయులు, స్థానికుడు**

సమాధానం: రెండు రోజుల్లో తొలగిస్తాం. **- మోనాలిసా, సర్పంచి**

సమస్య: శివారులో శ్మశానం నుంచి నీటితొట్టెకు వెళ్లే దారిలో ముళ్ల పొదలు పెరిగి ఇబ్బందిగా ఉంది. **- రామరాజు, పందికుంట**

సమాధానం: ముళ్లపొదలను తొలగించి సమస్యను పరిష్కరిస్తాం. **- మణిభూషణ్, పీఆర్ మండల ఇంజినీర్**

సమస్య: తిప్పనపల్లి ఉన్నత పాఠశాలకు ప్రహరీ ఏర్పాటు చేయాలి. **- గోవిందరెడ్డి**

సమాధానం: పరిశీలించి ప్రతిపాదనలు పంపి, మంజూరైన వెంటనే నిర్మిస్తాం. **- శ్రీధర్, ఎంఈవో**

సమస్య: శెట్టూరులో మూతపడిన డైరీని పునరుద్ధరించాలి. **- నగేశ్**

సమాధానం: పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటాం. **- రఘురామ్‌రావు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో**

– వజ్రకరూరు, శెట్టూరు, న్యూస్‌టుడే

చిరువ్యాపారులకు ఎమ్మెల్యే తోడ్పాటు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: తనవంతుగా సాయం చేశానని.. ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయ సాధనలో భాగంగా ‘పూర్ టు రీచ్’ కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రజావేదిక వద్ద చిరువ్యాపారులకు తోపుడు బండ్లను పంపిణీ చేశారు. సొంతంగా రూ. 2 లక్షలు వెచ్చించి 10 మందికి పంపిణీ చేశారు. వ్యాపార అవసరాలను బట్టి ఒక్కొక్కరికీ తాను రూ.10 వేలు, బ్యాంకుల నుంచి రుణ సహకారం అందిస్తామన్నారు. సక్రమంగా చెల్లించి ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు.



చిరువ్యాపారులకు తోపుడు బండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

ఎంతో ఊరట: గౌరమ్మ, పూల వ్యాపారి



ఇరవై ఏళ్లుగా తోపుడు బండికి అద్దె చెల్లిస్తూ పూలు అమ్ముకొంటూ జీవనం సాగిస్తున్నాను. ఎమ్మెల్యే తోపుడు బండి ఇవ్వడంతో ఎంతో ఊరట కలిగింది. అనంతపురం నుంచి పూలు కొనుగోలు చేసి విక్రయిస్తాను. రోజు రూ.500 కూలి గిట్టుబాటు అవుతోంది.

మనో ధైర్యం నింపింది: చంద్రమోహన్, పండ్ల వ్యాపారి



తోపుడు బండ్లు అందించి, బ్యాంకుల ద్వారా రుణాలు అందేలా చూస్తానని ఎమ్మెల్యే చెప్పడం ధైర్యాన్ని నింపింది. గత పదేళ్లుగా తోపుడు బండిపై పలు రకాల పండ్లను విక్రయిస్తున్నాను. అనంతపురం, కర్ణాటక నుంచి పండ్లు తెచ్చుకుని అమ్ముకుంటా. రోజు కూలి రూ.600 వరకు గిట్టుబాటు అవుతోంది.

డీఈగా సుధాకర్‌నాయక్ బాధ్యతలు

రాయదుర్గం, న్యూస్‌టుడే: పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఎస్.ఆర్. సుధాకర్ నాయక్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. రాయదుర్గం పీఆర్ డీఈగా పనిచేస్తున్న రామ్మోహన్‌రెడ్డి వైఎస్ఆర్ జిల్లా క్వాలిటీ కంట్రోల్ డీఈగా బదిలీ అయ్యారు. పెనుకొండలో డీఈగా పనిచేస్తున్న సుధాకర్ నాయక్ రాయదుర్గం పీఆర్ డీఈగా బదిలీపై వచ్చారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును మర్యాద పూర్వకంగా కలిశారు.

వరద బాధితులకు సాయం

కుందుర్పి, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు మండలంలోని సమాజ క్రాంతి ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు లెనిన్ బాబు రూ.50 వేల చెక్కును బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందజేశారు. తమ ట్రస్టు నిర్వహిస్తున్న సామాజిక, సేవా, విలువల బడుల కార్యక్రమాలను ముఖ్యమంత్రికి వివరించినట్లు లెనిన్ బాబు తెలిపారు.

కిసాన్ క్రెడిట్ కార్డులతో రుణాలు

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని వడ్రవన్నూరులో 74ఉడేగోళం ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఘర్ ఘర్ కిసాన్ క్రెడిట్ కార్డుపై రైతులకు రుణాలు మంజూరు చేయనున్నట్లు రాయదుర్గం ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ ఫణిభూషణ్, సీఈవో ఆంజనేయులు తెలిపారు. సర్పంచి అశోక్ అధ్యక్షతన బుధవారం పీఏసీఎస్ రైతుల సమావేశంలో అధికారులు పాల్గొన్నారు. ప్రతి రైతుకు ఖరీఫ్, రబీ పంట, దీర్ఘకాలిక రుణాలు, పాడి పరిశ్రమ ఏర్పాటుకు ఆవులు, గేదెలకు రుణాలు, వ్యవసాయ రుణాలను విరివిగా అందజేస్తామన్నారు.



రాయదుర్గం: ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును సన్మానిస్తున్న పురుషోత్తం దంపతులు



కళ్యాణదుర్గం: గోడపత్రాలు అందజేస్తున్న అధికారులు, నాయకులు



ఉరవకొండ: చిన్న ముష్టూరులో పథకాలపై ప్రజలకు వివరిస్తున్న నాయకులు

స్వర్ణాంధ్ర సాధనకు చంద్రబాబు కృషి

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో బుధవారం ‘ఇది మంచి ప్రభుత్వం’ కార్యక్రమాలు జరిగాయి. రాష్ట్రాన్ని 2047 కల్లా స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చటానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో ప్రతి ఇంటికీ తెదేపా నాయకులు, సచివాలయ ఉద్యోగులు వెళ్లి గోడపత్రాలు పంపిణీ చేశారు. ఉరవకొండలో నాయకులు ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. భవిష్యత్తులో ప్రభుత్వం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలియజేశారు. **- న్యూస్‌టుడే, బృందం**

ఉచిత నేత్ర శిబిరానికి స్పందన

ఉరవకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని తొగటవీరక్షత్రియ కల్యాణ మండపంలో ధర్మవరం రోటరీ క్లబ్, చౌడేశ్వరిదేవి చేనేత కార్మిక సంక్షేమ సంఘం సంయుక్తంగా బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించాయి. ఆ ప్రాంత ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. బెంగళూరులోని శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు పరీక్షలు చేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. పేదల సదుపాయార్థం నెలకొసారి కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కల్యాణ మండపం నిర్వాహకులు శ్రీనివాసులు, రవి, ఎర్రిస్వామి, శ్రీనివాసులు, హరిదాసు, రాము తెలిపారు.

ట్యాక్సీ డ్రైవర్ల నూతన కార్యవర్గం

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని 74ఉడేగోళం సమీపంలోని మద్దానేశ్వరస్వామి ఆలయంలో బుధవారం రాయదుర్గం పట్టణం ట్యాక్సీ డ్రైవర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. రాయదుర్గం ట్యాక్సీ డ్రైవర్ల నూతన కమిటీ అధ్యక్షుడిగా రామాంజనేయులు, ఉపాధ్యక్షుడిగా బాషా, సెక్రటరీగా పరమేశ్, జాయింట్ సెక్రటరీగా రమేశ్, కోశాధికారిగా కిరణ్ ఎన్నికయ్యారు. సభ్యత్వం కల్పించి గుర్తింపు కార్డులు ఇస్తామన్నారు. డ్రైవర్ల సంక్షేమానికి ప్రత్యేక నిధి ఏర్పాటు చేస్తామన్నారు. ఏకాంత్, ఆవిష్, తిప్పేస్వామి, వెంకటేశులు పాల్గొన్నారు.

గుంతల దారితో ఇక్కట్లు



ఉరవకొండ - బొమ్మనహాళ్‌కు వెళ్లే ప్రధాన రహదారి ఉరవకొండ శివారు నుంచి సుమారు 15 కి.మీ. మేర గుంతలను తలపిస్తూ అధ్వానంగా ఉంది. వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బస్సులు, ఇతర పెద్ద వాహనాలు వెళ్లడానికి కష్టంగా ఉంది. గత ఐదేళ్ల వైకాపా ప్రభుత్వంలో ఆ రహదారి ఆధునికీకరణకు నోచుకోలేదు. దీని కారణంగా నిత్యం ఆ రహదారిపై రాకపోకల సాగించే పదికి పైగా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు గుర్తించి రహదారికి మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. దీనిని ఆర్‌అండ్‌బీ ఏఈఈ కావ్య దృష్టికి తీసుకెళ్లగా రోడ్డు మంజూరైందని, త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు.

- న్యూస్‌టుడే, ఉరవకొండ

అపరిశుభ్రత తొలగించరూ..!

మండలంలోని లింగదీర్లపల్లి ప్రాథమిక పాఠశాల ముందు నిత్యం ఇలా నీరు నిల్వ ఉండి అపరిశుభ్రత నెలకొంటోంది. దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడే అవకాశం ఉందని గ్రామస్థులు వాపోతున్నారు. పాఠశాల ప్రహరీ పక్కనే కుళాయిలు ఉన్నాయని, లీకేజీ నీరు రోడ్డుపై చేరి రాకపోకలకు ఇబ్బందిగా ఉందన్నారు. సమస్యను పట్టించుకునే నాథుడే లేరని విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లీకేజీ మరమ్మతు చేసి అపరిశుభ్రతను తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయమై గ్రామకార్యదర్శి మల్లికార్జునను వివరణ కోరగా.. తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, శెట్టూరు**



దశభుజగణపతి హుండీ ఆదాయం రూ.8.32 లక్షలు

రాయదుర్గం, న్యూస్‌టుడే: రాయదుర్గంలో ప్రసిద్ధి చెందిన శ్రీదశభుజగణపతి ఆలయం హుండీ బుధవారం ఆలయ కమిటీ సభ్యులు లెక్కించారు. రూ.8.32 లక్షలు ఆదాయం వచ్చిందని కమిటీ అధ్యక్షుడు బి.టి.వెంకటేశులు తెలిపారు. ఈ నిధులతో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ గోపుర నిర్మాణం, ధ్వజస్తంభం ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అక్టోబరు 5న చెన్నైకు చెందిన శిల్పులతో ఆలయ గోపుర నిర్మాణానికి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు భూమిపూజ చేయనున్నారన్నారు. ఆలయ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.టి.వెంకటేశులు, గౌరవాధ్యక్షులుగా వై.వెంకటేశులు, తాయి రాజశేఖర్, ఉపాధ్యక్షుడిగా హర్షవర్ధన్, కార్యదర్శిగా సుధాకర్, జాయింట్ సెక్రటరీగా కెరె.వినాయక, కోశాధికారిగా గురుమాల్ నాగేంద్ర ప్రసాద్, కోట్రెజరర్‌గా కె.ఎర్రిస్వామిలను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా ఎం.ఎస్.హరికృష్ణారావు, కె.ప్రశాంతి, ఎన్.కృష్ణ, డా. బి.ఎం.శ్రీరామరెడ్డి, బండి కపిల్, బి.పృథ్వీ, వి.మంజునాథ, పి.నవీన్, బి.హర్ష, ప్రకాశ్, బి.కె.తిప్పేస్వామిలను ఎన్నుకున్నారు.

వలస కూలీల చదువులకు అగచాట్లు

గుమ్మఘట్ట, న్యూస్‌టుడే: వలస కూలీల పిల్లలు చదువులకు దూరం కాకూడదనే ఉద్దేశంతో 2017లో తెదేపా ప్రభుత్వం గోనబావి వద్ద రూ.24 కోట్లతో జ్యోతిరావుపులే బాలికల గురుకుల పాఠశాల నిర్మాణం చేపట్టింది. దాదాపుగా 40 శాతం నిర్మాణ పనులు జరిగాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. పాఠశాలను తాత్కాలికంగా గుమ్మఘట్టలోని కంబళ్ల సొసైటీలో నడుపుతున్నారు. భవన నిర్మాణ పనులు పూర్తవుతాయని, అధికారంలోకి వచ్చినా కూటమి ప్రభుత్వంపైనే విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఆశలు పెట్టుకున్నారు.

★ కంబళ్ల సొసైటీలో రెండు పెద్ద రేకుల గోదాముల్లో 5 నుంచి 10వ తరగతి వరకు మొత్తం 320 మంది విద్యార్థులకు చదువులు చెబుతున్నారు. 150 మందికి పైగా విద్యార్థినులు అక్కడే నిద్రిస్తున్నారు. సరైన వసతులు లేక విద్యార్థినులు నానా అవస్థలు పడుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు.

★ విద్యార్థులకు తాగునీరు క్యాన్లలో తెస్తున్నారు. 30 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. వర్షాకాలం, వేసవిలో విద్యార్థినుల కష్టాలు వర్ణతీతం. వసతులు లేవని పాఠశాలలో చేరేందుకు విద్యార్థినులు నిరాకరిస్తున్నట్లు సమాచారం.

★ 17 మంది సిబ్బందికి గాను 10 మంది శాశ్వత ప్రాతిపదికన, ఇక 7 మంది గెస్టులతో పాఠశాలను నడుపుతున్నారు. ఈ విషయమై ప్రిన్సిపల్ శ్రీదేవిని వివరణ కోరగా.. నూతన భవనం పూర్తయితే విద్యార్థుల సంఖ్య 480 మందికి పెరుగుతుందన్నారు. ప్రభుత్వం స్పందించి ఆగిన పాఠశాల భవన నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని అభిప్రాయం వ్యక్తం చేశారు.



జ్యోతిరావుపులే పాఠశాలలో విద్యార్థులు

గ్రామసింహాలతో జాగ్రత్త..

■ హడలిపోతున్న పట్టణవాసులు

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో గ్రామ సింహాల దాడులు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. పాఠశాలలకు సైకిళ్లపై వెళ్లే విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులపై దాడి చేస్తున్నాయి. మూడు రోజుల కిందట ఒకే కుక్క నలుగురిపై దాడి చేసి గాయపర్చింది. ఇందులో ఓ చిన్నారి ముక్కు తెగిపోవడంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు.


● పట్టణంలోని గాంధీ పాఠశాల, నేసేపేట, దాసప్ప, నేతాజీ రోడ్డు, శాంతినగర్, వాల్మీకి నగర్, కోతిగుట్ట, ముత్రాసి కాలనీ, మారెమ్మ గుడి ప్రాంతాల్లో కుక్కలు గుంపులుగా తిరుగుతూ పాదాచారులపై దాడి చేస్తున్నాయి. చిన్న పిల్లలు వాటిని చూసి భయపడుతూ పాఠశాలలకు కూడా వెళ్లడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు.

● కేబీ ప్యాలెస్ రోడ్డులో చికెన్, మటన్ మార్కెట్ ఉన్నందున నిత్యం పదుల సంఖ్యలో దుకాణాల చుట్టూ సంచరిస్తూ అందరినీ భయపెడుతున్నాయి. కవర్లలో మాంసం తీసుకెళ్తున్నప్పుడు వెనుక నుంచి వచ్చి లాక్కొంటున్నాయి. గత ఏడాది ఒకే రోజు ఒకే కుక్క ఎనిమిది మందిపై ఇదే ప్రాంతంలో దాడి చేసి గాయపర్చిన ఘటనలూ ఉన్నాయి.

● కుక్కల సంతతి పెరగకుండా కు.ని శస్త్రచికిత్సలు చేయించడం, అటవీ ప్రాంతంలో వదిలి రావడం చేయాలి. మున్సిపల్ అధికారులు గత అయిదేళ్లలో చేపట్టిన దాఖలాలు లేవు.

● కుక్క కరిచిన వెంటనే ఆసుపత్రిలో చికిత్స తీసుకోవాలని సూపరింటెండెంట్ డా.మాధవి తెలిపారు. క్రమం తప్పకుండా టీకాలు వేయించుకోవాలని, ముందు జాగ్రత్తగా ఏఆర్‌వీ టీకా వేయించుకుంటే ప్రమాదం ఉండదన్నారు.

● ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డిని వివరణ కోరగా.. వారం రోజుల్లో ప్రణాళిక సిద్ధం చేసి పశు వైద్యుల సాయంతో కుక్కల సంతతి పెరగకుండా శస్త్రచికిత్సలు చేయిస్తామన్నారు. కుక్కలను ఇతర ప్రాంతాల్లో వదిలేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



బయటకు రావాలంటే భయపడుతున్నారు

- లక్ష్మి, ముత్రాసి కాలనీ



కుక్కల భయంతో పిల్లలు బయటకు రావాలంటే భయపడుతున్నారు. వృద్ధులు, నడవలేని నిస్సహాయులపై దాడి చేస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కుక్క కరిచాక క్రమం తప్పకుండా టీకాలు వేయించుకోవాల్సి ఉంటుంది.

శునకాలను దూరంగా తరలించాలి

-రామకృష్ణ, మారెమ్మ గుడి ప్రాంతం



ఇటీవల అనంతపురం ప్రధాన రహదారిలోని బళ్లారి - మొలకాల్మూరు రోడ్డులో ఎక్కువగా కుక్కలు ద్విచక్ర వాహన చోదకులపై దాడులు చేస్తున్నాయి. సంబంధిత అధికారులు దూరంగా తరలించేందుకు చర్యలు తీసుకోవాలి. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు జంకుతున్నారు.

గోకులాల నిర్మాణాలపై దృష్టి పెట్టండి

ఉరవకొండ, న్యూస్‌టుడే: రైతులు, జీవాల పెంపకందారుల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం గోకులాల నిర్మాణాలకు అధిక ప్రాధాన్యమిస్తోందని పశుసంవర్ధక జేడీ డాక్టర్ వెంకటస్వామి పేర్కొన్నారు. బుధవారం ఉరవకొండలోని ఆ శాఖ డీడీ కార్యాలయంతో పాటు ఏడీ స్థాయి పశువైద్యశాలను తనిఖీ చేశారు. దస్త్రాలను పరిశీలించి, వైద్యాధికారులు గోకులాల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. దరఖాస్తుల ఆధారంగా సంబంధిత రైతులను చైతన్యం చేయాలన్నారు. పశువులు, జీవాల్లో కాలానుగుణ వ్యాధులకు సంబంధించిన టీకాల పంపిణీని సమర్థంగా నిర్వహించాలన్నారు. ఆయన వెంట డీడీ డా.వెంకటేశ్ ఉన్నారు.

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

'రైతు ఆత్మహత్యకు అధికారుల తీరే కారణం'

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే : పామిడికి చెందిన రైతు సూర్యనారాయణ ఆత్మహత్య చేసుకోవడానికి గార్లదిన్నె అప్పటి రెవెన్యూ అధికారులే కారణమని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. గార్లదిన్నె తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం వివిధ సంఘాల నాయకులతో కలిసి ధర్నా చేశారు. అనంతరం పలు విషయాలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ఈరమ్మకు అందించారు. ఈకార్యక్రమంలో ఎరుపల హక్కుల పోరాట సమితి ఉమామహేశ్వరి, రైతు సంఘం అశోక్, జైభీమ్ సేన తరిమెల రామాంజనేయులు, సాకే ఓబిలేసు, మాల మహానాడు ఆనంద్, పుల్లన్న, మధు, రుషీంద్రబాబు, రామకృష్ణ, మాధవయ్య, రమేష్, ఆది తదితరులు పాల్గొన్నారు.

సంరక్షణ కమిటీ చెంతకు బాలిక

గుంతకల్లు, న్యూస్‌టుడే : రైలులో తప్పిపోయి ఒంటరిగా ప్రయాణిస్తున్న బాలికను గుర్తించిన టీటీఈ సందీప్ గుంతకల్లు రైల్వే రక్షణదళం సిబ్బందికి అప్పగించారు. ఈ ఘటన బుధవారం తిరుపతి నుంచి గుంతకల్లు మీదుగా జమ్ముతావికి వెళ్లే రైలు (22705)లో జరిగింది. బెంగళూరుకు చెందిన బాలిక లక్ష్మి తిరుపతి నుంచి బెంగళూరుకు వెళ్లే రైలులో కాకుండా గుంతకల్లు మీదుగా ప్రయాణించే రైలు ఎక్కింది. ఈక్రమంలో స్లీపర్ కోచ్‌లో నిద్రపోతుండగా ఆమెను గుర్తించిన టీటీఈ ఆర్పీఎఫ్ పోలీసులకు అప్పగించారు. బాలికను గుంతకల్లు ఆర్పీఎఫ్ మహిళా కానిస్టేబుళ్లు అరుంధతి, వసంతలు చేరదీసి అనంతపురం పిల్లల సంరక్షణ కమిటీకి అప్పగించినట్లు గుంతకల్లు ఆర్పీఎఫ్ సీఐ వసంతకుమార్ చెప్పారు.

వృద్ధుడి ఆత్మహత్య

శింగనమల, న్యూస్‌టుడే: గురుగుంట్ల గ్రామానికి చెందిన లక్ష్మీరెడ్డి(82) అనే రైతు బుధవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ కౌలుట్లయ్య అందించిన వివరాల మేరకు వృద్ధుడు కడుపునొప్పి తట్టుకోలేక ఇంటి బయట చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. గత కొన్ని రోజులుగా కడుపు నొప్పితో ఇబ్బంది పడుతూ అనారోగ్యానికి గురయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆటో డ్రైవరు బలవన్మరణం

పెద్దవడుగూరు: పెద్దవడుగూరుకు చెందిన శేషు(38) అనే ఆటో డ్రైవరు బుధవారం ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం పామిడి ఆసుపత్రికి తరలించారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

తాడిపత్రి: గన్నెవారిపల్లి కాలనీకి చెందిన ప్రశాంతి తన భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాలనీకి చెందిన ప్రశాంతికి ఆత్మకూరు మండలం తోపుదుర్తికి చెందిన రామాంజనేయులకు రెండేళ్ల కిందట వివాహం జరిగింది. పెళ్లి కట్నం తీసుకొని మళ్లీ అదనంగా ఇవ్వాలని వేధిస్తుండటంతో ఫిర్యాదు చేశారు.

ముగ్గురిపై అట్రాసిటీ..

తాడిపత్రి, న్యూస్‌టుడే : ఊరుచింతల గ్రామం వద్ద ఓ దళిత వ్యక్తిపై దాడిచేసినందుకు ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు గ్రామీణ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. గత నెల 27న ఊరుచింతల గ్రామం వద్ద అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను రామ్మోహన్ అనే వ్యక్తి అడ్డుకోగా ఆలూరు గ్రామానికి చెందిన సూర్యనారాయణరెడ్డి, తాడిపత్రికి చెందిన మల్లికార్జున, మారుతి కలిసి సదరు వ్యక్తిని కులం పేరుతో దూషించి దాడి చేయడంతో బాధితుని ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

రెచ్చగొట్టే వాఖ్యలు చేయడంతో..

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలోని భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన రాఘవరాయుడు సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే విధంగా వాఖ్యలు చేస్తున్నాడని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వైకాపా మద్దతుదారుడు రాఘవరాయుడు కొన్ని రోజులుగా అధికార పార్టీ నాయకులపై రెచ్చకొట్టే విధంగా వాఖ్యలు చేస్తుండటంతో కేసు నమోదు చేశామని తెలిపారు.

మహిళపై దాడి

యల్లనూరు : యల్లనూరులో ఓ మహిళపై దాడి జరిగిన కేసులో పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద చాపల అశోక్, రాజు గొడవ పడుతుండగా చాపల పద్మావతి వారిని వారించడంతో చాపల అశోక్ మరో ఇద్దరు కలిసి ఆమెపై దాడి చేశారు..

రైతు కుటుంబానికి రూ.25 లక్షలివ్వాలి

గార్లదిన్నె గ్రామీణం : పామిడికి చెందిన రైతు సూర్యనారాయణ ఆత్మహత్య చేసుకున్నారని, ఆ కుటుంబానికి రూ.25లక్షలు పరిహారం కింద ఇవ్వాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గార్లదిన్నె తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం రైతు సంఘం నాయకులు రైతు చిత్రపటానికి పూలమాలలు వేసి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ ఈరమ్మకు వినతి పత్రం అందజేశారు.

పిల్లలకు ఆటవిడుపు కరవు

❒ అధ్వానంగా పార్కులు ❒ గుత్తేదారుల జేబులు నింపేందుకే పనులు



ప్రభాత్‌నగర్ పార్కులో ముళ్లపొదల్లో పిల్లల ఆట పరికరాలు

గుంతకల్లు, న్యూస్‌టుడే : పిల్లలు ఆడుకోవడానికి, రైల్వే కుటుంబాలు సేదతీరడానికి రైల్వే అధికారులు ఏర్పాటు చేసిన పార్కులు దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. వాటిల్లో పిల్లలు ఆడుకునే పరిస్థితి ఏమాత్రం లేదు. రూ.లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన ఆటపరికరాలన్నీ తుప్పుపట్టి దారుణంగా తయారయ్యాయి. పార్కుల పనులు చేసిన గుత్తేదారులు మాత్రం బిల్లులు మంజూరు చేయించుకొని గాలికి వదిలేశారు. ఆ పనులన్నీ వారి జేబులు నింపేందుకే అన్నట్లుగా పరిస్థితి తయారైందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆహ్లాదకరంగా ఉండాల్సిన వనాలన్నీ ముళ్లపొదలతో దర్శనమిస్తున్నాయి. వాస్తవానికి రైల్వే పార్కుల ఏర్పాటుకు రూ. 2 కోట్లకు పైగా ఖర్చు చేశారు. ఇంత చేసినా ఏమాత్రం ప్రయోజనం లేదని రైల్వే ఉద్యోగులు వాపోతున్నారు.

క్షేత్రస్థాయిలో ఇదీ పరిస్థితి

ప్రభాత్‌నగర్‌లోని పార్కులో పిల్లలు ఆడుకోవడానికి ఏర్పాటు చేసిన క్రీడా పరికరాలు ప్రస్తుతం ఎందుకు పనికి రాకుండాపోయాయి. తిరుగుడు యంత్రాలు, తొక్కుడు బిళ్లలు, జారుడు బల్లలు ఇలా చాలా వరకు పని చేయడం లేదు. వివేకానంద నగర్‌లో నాలుగు జారుడు బల్లలు, చిన్నపిల్లలు ఊగే ఉయలలు దెబ్బతిన్నాయి. దాదాపు పార్కులన్నీ పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. ఇక మొదలియార్ ఆడిటోరియానికి అనుబంధంగా అధికారులు పెద్దఎత్తున నిధులు ఖర్చు చేసి పార్కు ఏర్పాటు చేసినా గాలికొదిలేశారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందిస్తూ పార్కులను శుభ్రం చేసి వినియోగంలోకి తెస్తామన్నారు.

రైల్వే కుటుంబాలు	రైల్వే ఉద్యోగులు	పార్కుల సంఖ్య	నిధుల ఖర్చు
: 20 వేలు	: 10 వేలు	04	రూ.2 కోట్లు (సుమారుగా)



వివేకానందనగర్ పార్కులో ఊయల పోయి స్తంభాలు మిగిలాయి



దారిలో కంప చెట్లను పొక్లెయిన్‌తో తొలగిస్తున్న రైతులు

సొంత లాభం.. కొంత మానుకొని

పెద్దపప్పూరు(తాడిపత్రి పట్టణం), న్యూస్‌టుడే: మండలకేంద్రంలోని చాగల్లు జలాశయ కుడి కాలువ పక్కన ఉన్న రహదారిలో రైతులు కంపచెట్లను సొంత ఖర్చులతో తొలగించారు. గత వైకాపా ప్రభుత్వం కాలువ నిర్వహణను పట్టించుకోకపోవడంతో నాలుగేళ్ల నుంచి కంపచెట్లు పెరిగి రహదారిని కప్పేశాయి. పెద్దపప్పూరులోని పలువురు రైతులు కలిసి పొక్లెయిన్‌తో దాదాపు 2 కి.మీ.ల మేర కంప చెట్లను స్వచ్ఛందంగా తొలగించారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లా స్థాయి కుస్తీ పోటీలు నిర్వహించారు. అండర్- 14, అండర్- 17 విభాగాల్లో బాలబాలికలకు పాఠశాల ప్రధానోపాధ్యాయిని శారదాబాయి ఆధ్వర్యంలో పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ప్రతిభ కనబరిచిన క్రీడారులను ఎంపిక చేశారు. గేమ్స్ ఇన్‌ఛార్జి నాగరాజు, కోచ్ రాఘవేంద్ర, పీడీ రామ్‌ప్రసాద్‌పాల్గొన్నారు.



బుక్కరాయసముంద్రంలో చదరంగం పోటీలు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : కొర్రపాడు ప్రభుత్వ ఉన్నత క్రీడా మైదానంలో బుధవారం నియోజకవర్గస్థాయి పాఠశాల క్రీడా పోటీలు పోటీలు ప్రారంభమయ్యాయి. ఆరు మండలాల నుంచి 400 మందికి పైగా విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. కొర్రపాడు ప్రభుత్వ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్, వ్యాయామ ఉపాధ్యాయులు నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

గుంతకల్లు పట్టణం : గుంతకల్లులోని ఎస్‌జేపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం నియోజకవర్గం స్థాయి అండర్-14, అండర్-17 విభాగంలో బాలబాలికలకు అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి.

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: విద్యతోపాటు క్రీడల్లో ప్రతి విద్యార్థి రాణించాలని దిమ్మగుడి జడ్పీఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు పేర్కొన్నారు. పాఠశాలస్థాయి క్రీడల్లో భాగంగా బుధవారం మండలంలోని దిమ్మగుడి ఉన్నత పాఠశాలలో క్రీడలను ఆయన ప్రారంభించారు.

ద్విచక్రవాహన దొంగల అరెస్టు

తాడిపత్రి, న్యూస్‌టుడే: ద్విచవాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు డీఎస్పీ రామకృష్ణుడు తెలిపారు. బుధవారం గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాడిపత్రి మండలం వెంకటాంపల్లి గ్రామానికి చెందిన వెంకటప్రసాద్ అనే వ్యక్తి పొలం వద్ద ద్విచక్రవాహనాన్ని నిలిపి పనులు చేసుకుంటుండగా నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కోటపాడు గ్రామానికి చెందిన నాగరాజు ద్విచక్రవాహనాన్ని తీసుకొని వెళ్తుండగా వెంబడించి అతన్ని పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని నిందితున్ని అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిపారు. నాగరాజు, అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుతో కలిసి పలు ప్రాంతాల్లో 8 మోటారు సైకిళ్లను దొంగిలించారని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వివరించారు. సీఐ శివగంగాధర్‌రెడ్డి, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

సమస్య: యాడికిలోని వెంగమనాయుడు కాలనీ, రాఘవేంద్ర కాలనీల్లోని ఇళ్ల పరిసరాల్లో ముళ్ల పొదల ఎక్కువగా ఉన్నాయి. **- కాలనీ వాసులు**

సమాధానం: సమస్యను పరిష్కరిస్తాం. **- ఎర్రిస్వామి, పంచాయితీ ఈఓ**

–న్యూస్‌టుడే, యాడికి

సమస్య: గుంతకల్లులోని కూరగాయల మార్కెట్ మున్సిపల్ కాంప్లెక్స్‌లోని ఏబ్లాక్‌లో మొదటి ఫ్లోర్ పైన ప్లాస్టిక్ సీసాలు, మద్యం సీసాల వ్యర్థాలు కుప్పగా ఉన్నాయి. **- రామ్‌నరేష్, వ్యాపారుస్థుడు**

సమాధానం: సమస్యను పరిష్కరిస్తాం. **-వెంకటరమణయ్య, కమిషనర్**

–న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

ఎస్‌పీ బాలుకు నివాళి

గుంతకల్లు పట్టణం, : గుంతకల్లులో డీఎంఎం గేటు ఏరియా ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం సినీ గాయకుడు ఎస్పీ బాలుసుబ్రహ్మణ్యం వర్ధంతిని నిర్వహించారు. పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈవో రాముడు, కార్యదర్శి రామారావు, సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలల వేసి నివాళి అర్పించారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రి పురప్రజల సమస్యల పరిష్కరించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నట్లు మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలంయలో బుధవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో పురపాలికలోని పలు కాలనీల్లో ఉన్న స్పాట్ డెలివరీ ట్యాంకులకు మోటార్లను అమర్చేందుకు రూ.5 లక్షలు, పేదల కడుపు నింపేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అన్న క్యాంటీన్ కోసం నిధుల మంజూరు, ఎస్టీపీలు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెచ్చేందుకు రూ.19లక్షలు ఏటాయిస్తూ సమావేశంలో తీర్మానించారు. అనంతరం తాడిపత్రి మున్సిపల్ కార్యాలయానికి నూతనంగా బదిలీపై వచ్చిన పలువురు అధికారులను కౌన్సిల్ సభ్యులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ అబ్దుల్ రహీం, మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, పలువురు కౌన్సిల్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

'సీపీఐని బలోపేతం చేద్దాం'

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: శింగనమల నియోజకవర్గంలో గ్రామస్థాయిలో సీపీఐని బలోపేతం చేద్దామని ఆపార్టీ జిల్లా కార్యదర్శి జాఫర్ పిలుపునిచ్చారు. బుధవారం బుక్కరాయసముద్రం వాల్మీకి కళ్యాణమండపంలో నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భగా ఆయన మాట్లాడుతూ త్వరలో గ్రామాల్లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో సీపీఐ పోటీచేస్తుందన్నారు. 100 రోజుల కూటమి ప్రభుత్వంలో పించన్ల పెంపు, అన్న క్యాంటీన్ల పారంభం విషయంలో ప్రజలకు మంచి జరిగిందన్నారు. తిరుపతి లడ్డూ విషయంలో కూటమి ప్రభుత్వం రాజకీయం చేయడం మానుకోవాలన్నారు. సీపీఐ నాయకులు నారాయణస్వామి, మల్లికార్జున, రామకృష్ణ, గంగాధర్, తిరుపతయ్య, శ్రీనివాసులు, రాము, శివారెడ్డి, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.



గుత్తిలోని బీసీకాలనీకి వెళ్లే మార్గంలో కుంగిన సీసీరహదారి

నాసిరకం పనులు బహిర్గతం

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తిలోని బీసీకాలనీకి వెళ్లేదారిలో సిమెంట్ రోడ్డు కుంగిపోయింది. రోడ్డు నిర్మాణాలను నాసికరంగా చేపట్టడం వల్ల సమస్య ఎదురైంది. తురకపల్లిరోడ్డు నుంచి బీసీకాలనీకి రెండేళ్ల కిందట పురపాలిక ఇంజినీర్లు రోడ్డు వేశారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో కుంగిపోయింది. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రోడ్డు అనతికాలంలోనే ఇలా కావడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డీఈఈ హేమచంద్ర స్పందిస్తూ రహదారికి మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

ప్రభుత్వ ఖజానాకు గండి

పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అక్రమ లేఅవుట్లు

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే : పెద్దవడుగూరు పరిసర ప్రాంతాల్లో కొందరు యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లు ఏర్పాటు చేసుకుంటున్నా ఎవరికీ పట్టడం లేదు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో పెద్దవడుగూరులోని చేనేత కాలనీ వద్ద వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చి లేఅవుట్ వేశారు. రెవెన్యూ, పంచాయతీశాఖలకు రుసుం చెల్లించాల్సి ఉండగా అవేమీ పట్టని కొందరు భూమిని కొనుగోలు చేసి ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. తద్వారా ప్రభుత్వానికి ఆదాయానికి భారీగా గండిపడుతోంది.



లక్షుంపల్లి రోడ్డులో వేసిన లేఅవుట్

విపణిలో స్థలాలకు డిమాండ్

మండల కేంద్రంలో స్థలాల విలువ పెరిగిపోవడంతో లక్షుంపల్లి, మిడుతూరు, తెలికి రోడ్డు, ఆశ్రమం, ఆసుపత్రి వెనుక ప్రాంతాలు, క్రిష్టిపాడు, మిడుతూరు, కాశేపల్లి 44వ జాతీయరహదారిలో కొందరు అనధికార లేఅవుట్ల ప్లాట్లను వేసి విక్రయిస్తున్నారు. పంచాయతీ, రెవెన్యూకు పన్నుల రూపంలో ఎలాంటి రుసుం చెల్లించలేదు. ఇక్కడ సెంటు స్థలం రూ.2లక్షల నుంచి రూ.5లక్షల మేరకు పలుకుతుండటంతో ప్లాట్లు వేసి స్థలాలను విక్రయించేందుకు అప్పట్లో నాయకులు భూమిని సిద్ధం చేసి విక్రయించారు.

దస్త్రాల్లో వ్యవసాయ భూమిగానే

వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పు చేసుకున్న కొందరు వ్యాపారం చేస్తున్నారు. మరోవైపు ఆ భూమి రెవెన్యూ దస్త్రాల్లో మాత్రం వ్యవసాయ భూమిగా నే ఉండటం వల్ల బ్యాంకుల్లో రుణాలు, ఇతరత్రా లబ్ధిపొందుతున్నారు.

ప్రత్యేక దృష్టి సారిస్తాం

మండలంలోని పలుగ్రామాల్లో కొందరు అనధికారికంగా లేఅవుట్లు వేసి విక్రయిస్తున్నారని తెలిసింది. సాగుభూమిని వ్యవసాయేతర భూమిగా మార్పుచేసుకున్న వాటిపై ప్రత్యేక దృష్టి సారించి రికార్డుల్లో తొలగించేలా చూస్తాం. రెవెన్యూ, పంచాయతీశాఖలకు తప్పనిసరిగా రుసుం చెల్లించాల్సి ఉంది. నిబంధనలు ఉల్లంఘించిన వారి జాబితాను పరిశీలించి ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటాం.

- ఉషారాణి, తహసీల్దారు

కల్వర్టు నిర్మించరూ!



వెంకటాంపల్లిలో అంగన్‌వాడీ 1,2 కేంద్రాలకు, ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాలంటే మురుగు కాలువ దాటాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొండపై నుంచి వచ్చే నీరు మురుగు కాలువలో చేరి కేంద్రాలకు వెళ్లడానికి ఇబ్బందిగా మారుతోంది. కాలువపై కల్వర్టు నిర్మించి సమస్యను పరిష్కరించాలని పిల్లల తల్లి దండ్రులు కోరుతున్నారు. మండల ఇంజినీరు ఓబులేసును వివరణ కొరగా కల్వర్టు నిర్మాణానికి ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలొస్తే సమస్యను పరిష్కరిస్తామన్నారు. –న్యూస్‌టుడే, గుంతకల్లు గ్రామీణం

రాకపోకలకు అగచాట్లు



గుంతకల్లులోని హౌసింగ్ బోర్డు కాలనీలోని విద్యుత్తు లైన్ రహదారి గుంతల మయం కావడంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. రెండు వందల మీటర్ల దాకా మట్టి రోడ్డు ఉంది. సీసీరోడ్లు, కాలువలు లేవు. మురుగు రోడ్లపై పారుతోంది. సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

ఇసుక ట్రాక్టర్ల జప్తు

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: గుత్తి-అనంతపురం సమీపంలో బుధవారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను జప్తు చేసినట్లు ఎస్సై చిన్నరెడ్డెప్ప తెలిపారు. గ్రామంలో కొందరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా సమీపంలోని వంక నుంచి ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా దాడులు చేసి పట్టుకున్నట్లు ఆయన తెలిపారు.

గార్లదిన్నె: కొప్పలకొండ గ్రామంలో బుధవారం మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై గౌస్‌బాషా తెలిపారు. గ్రామ సమీపాన పెన్నానది నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తుండగా సమాచారం మేరకు పోలీసు సిబ్బందితో దాడులు చేసి ట్రాక్టర్లను జప్తు చేసినట్లు చెప్పారు.

అందరి సంక్షేమమే లక్ష్యం



నాగసముద్రంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

యల్లనూరు మండలంలోని నేర్జాంపల్లె, గుంతకల్లు మండలం నాగసముద్రంలో బుధవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. నేర్జాంపల్లెలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, నాగసముంద్రంలో గుమ్మనూరు జయరామ్ పాల్గొన్ని ప్రభుత్వ లక్ష్యాలు, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

–న్యూస్‌టుడే, గుంతకల్లు గ్రామీణం,యల్లనూరు



యల్లనూరులో..ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ఆ ఐదేళ్లు.. గ్రామ ప్రగతికి నీళ్లొదిలారు

తాడిపత్రి, తాడిపత్రి పట్టణం, న్యూస్‌టుడే : తాడిపత్రి మండల పరిధిలోని గన్నెవారిపల్లి కాలనీ పంచాయతీలో మౌలిక వసతులు కరవయ్యాయి. సరైన కాలువల నిర్మాణం లేక మురుగు రహదారులపై పారుతోంది. పారిశుద్ధ్యం పడకేసింది. 25 వేల జనాభా ఉన్న పంచాయతీలో గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరించడంతో ప్రధాన వీధుల్లో సైతం సీసీ రహదారులు కరవయ్యాయి. చిన్నపాటి వర్షం వచ్చినా రహదారులు కుంటలను తలపిస్తున్నాయి. ఇళ్లు, రహదారుల పక్కన ఖాళీ స్థలాల్లో పనికిరాని మొక్కలతో పాటు మురుగు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. విషపురుగులు సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. దోమల బెడద అధికంగా ఉందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. జనం రోగాల బారిన పడుతున్నారు.



ఇళ్ల ముందు నిలిచిన మురుగునీరు

వైకాపా హయాంలో నాసిరకంగా పనులు

గత వైకాపా ప్రభుత్వం రూ. 80 లక్షలతో నిర్మించిన మురుగు కాలువలను కాసులకు కక్కుర్తిపడి గుత్తేదారులు నాసిరకంగా నిర్మించారు. నాణ్యతను పరిశీలించిన అధికారులు అలసత్వం ప్రదర్శించడంతో గుత్తేదారులు ఇష్టానుసారంగా వ్యవహరించారు. ఎక్కడికక్కడ పగుళ్లిచ్చి కాలువలు పాడైపోయాయి. మురుగు నీరు కదలని పరిస్థితి ఎదురవుతోంది. ప్రధాన రహదారుల పక్కన ఏర్పాటు చేసిన సిమెంట్ మూతలు దెబ్బతినడంతో ప్రమాదం పొంచి ఉంది.

సమస్య పరిష్కరిస్తాం

- జిలాన్‌బాషా, ఈవోఆర్డీ

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి దెబ్బతిన్న కాలువలకు మరమ్మతులు చేయించడంతో పాటు పంచాయతీ సిబ్బందితో మాట్లాడి మురుగు నిల్వలేకుండా చర్యలు చేపట్టి పారిశుధ్య సమస్య పరిస్కరిస్తాం.

ఆచార్యుడి పుస్తకం ఆవిష్కరణ

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: సెంట్రల్ యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్ ఆచార్యుడిగా పని చేస్తున్న దీపాంకర్‌పాండే 'ఇండియాస్ ఫ్రీడం మూవ్‌మెంట్ అండ్ అన్‌టోల్డ్ స్టోరీస్'' అనే పేరుతో రచించిన పుస్తకాన్ని అండమాన్ నికోబార్ పరిపాలనా అధికారి అనిల్ అగర్వాల్ ఆవిష్కరించారు. సాంస్కృతిక, కళల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో దిల్లీలో నేతాజీపై జరిగిన జాతీయ స్థాయి సెమినార్‌లో ఈ పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆచార్య దపాంకర్ పాండే 'న్యూస్‌టుడే'తో చరవాణిలో మాట్లాడుతూ భారతదేశ చరిత్రను దేశ ప్రజలకు తెలియజేయడానికి ఇలాంటి రచనలు మరిన్ని చేస్తానని తెలిపారు. ఆయన్ను వీసీ కోరి ప్రత్యేకంగా అభినందించారు.



ఆచార్య దీపాంకర్ పాండే పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

అనంతపురం

• అనంతపురం • రాప్తాడు

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండండి

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే : జిల్లాలో ప్రస్తుతం వాతావరణ మార్పులతో ఆకాశం మబ్బులు కమ్ముకుంది. వేరుసెనగ, కంది, పత్తి, వంటి పంటలకు తెగుళ్లు ఆశించే అవకాశం ఉందని, వ్యవసాయాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. బుధవారం అనంతపురం గ్రామీణం ఇటుకలపల్లి, ఎ.నారాయణపురం రైతు సేవా కేంద్రాల పరిధిలో గ్రామీణం ఏవో శశికళ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. డీఏవో హాజరై మాట్లాడుతూ.. వర్షాధారం కింద సాగైన వేరుసెనగ పంటకాయ దశలో ఉందని, కందిపంట, పత్తి పంటలు మొగ్గ, పూత దశల్లో ఉన్నాయన్నారు. ఏ పంటకు ఏ తెగులు ఆశిస్తోందో ముందుగా గుర్తించి, రైతులకు తెలిపాలన్నారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

ఆజాద్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: అధికారుల ధన దాహానికి బలైన గార్లదిన్నె మండలం క్రిష్ణాపురం గ్రామానికి చెందిన రైతు సూర్యనారాయణ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, వారి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం చెల్లించి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ప్రకటన విడుదల చేశారు. రైతుకు వారసత్వంగా సంక్రమించిన భూమిని రెవెన్యూ రికార్డుల్లోకి చేర్చడానికి అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదన్నారు. జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడంతో రైతు కలెక్టరేట్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.

డీఆర్‌డీఏ వెలుగులో భారీగా బదిలీలు

అనంత సంక్షేమం, న్యూస్‌టుడే : డీఆర్‌డీఏ-వెలుగులో భారీగా బదిలీలు జరిగాయి. ఐదేళ్లు పూర్తి అయిన వారితోపాటు అభ్యర్థనల బదిలీలకు అవకాశం కల్పించారు. అనంతపురం జిల్లా నుంచి మొత్తం 108 మంది బదిలీ అయ్యారు. నలుగురు డీపీఎంలు, ఈఓ ఒకరు, ఏపీఎంలు 32, సీసీలు 38, సీడీడబ్ల్యూ1, ఎంబీకేలు 20, ఎంఎస్‌సీసీ10, ఎంటీసీ 2 మంది బదిలీ అయ్యారు.

ఎస్సీ ఎస్టీ సమస్యలపై పోరాటం

అనంతపురం(గుల్జార్‌పేట), న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ ఎస్టీ సమస్యలపై పోరాటానికి సిద్ధమవుతున్నామని ఎస్సీ ఎస్టీ పరిరక్షణ సమితి రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు పేర్కొన్నారు. బుధవారం ఆ సంఘ కార్యాలయంలో సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సునీల్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులును ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామక పత్రాలను అందించారు. ఎస్సీ ఎస్టీలకు ముఖ్యంగా విద్యా, వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

సునాయాసంగా ఆదాయ లక్ష్యసాధన



యార్డు సంతలో చీనీకాయలు

చీనీ సంతతో అనంత మార్కెట్‌కు పెరుగుతున్న ఆదరణ

నెల	చీనీ టన్నులు	వచ్చిన ఆదాయం (రూ.లక్షల్లో)
ఫిబ్రవరి	3,689	1.08
మార్చి	10,644	15.44
ఏప్రిల్	17,909	35.88
మే	18,116	35.94
జూన్	16,591	32.09
జులై	17,088	24.97
ఆగస్టు	10,189	14.26

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలోని 17 వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డే పెద్దది. ఇక్కడి వ్యవసాయ మార్కెట్ యార్డు (ఏఎంసీ)లో సంతలు ఆదాయ వనరులుగా మారాయి. యార్డులో నిత్యం చీనీ సంత జరుగుతుంది. శనివారం గొర్రెలు, మేకలు, ఆదివారం పశువుల సంతలు నిర్వహిస్తారు. యార్డు 2024-25 ఆర్థిక సంవత్సరం రూ.4 కోట్లు లక్ష్యంగా నిర్దేశించారు. సెప్టెంబరు నెల ఇంకా వారం రోజులుంది. ఈ ఆరు నెలలకే రూ.2.51 కోట్లు ఆదాయం వసూలైంది.


● ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో చీనీ సంత నిత్యం ఉంటుంది. గతేడాది నుంచి పులివెందుల మార్కెట్‌లో కూడా చీనీ సంత నిర్వహిస్తున్నారు. పులివెందులలో నిర్వహణ సరిగా లేక సంత మూతపడింది. అనంతపురం యార్డులో ఏటా జనవరి నుంచి సెప్టెంబరు వరకు చీనీ సంత జోరుగా సాగుతుంది. రాయలసీమలోనే అత్యధికంగా చీనీ పండుతోంది. ఆయా జిల్లాల నుంచి చీనీకాయలు రైతులు సంతకు తీసుకొస్తారు. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకు మొత్తం 94,962 టన్నులకు రూ.1,60,71,274 యూజర్ ఛార్జీలు రూపంలో వసులైంది.

ఉద్యోగులు, సిబ్బంది సహకారం

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఎప్పుడూ ఆదాయం ఉంటుంది. ఏటా రాష్ట్రస్థాయి అధికారులు రూ.4 కోట్లు లక్ష్యం నిర్దేశిస్తున్నారు. ఆరునెలలకే రూ.2.51 కోట్లు ఆదాయం వచ్చింది. ఉద్యోగులు, సిబ్బంది సహకారంతో లక్ష్యాన్ని సాధిస్తాం. పశువులు, గొర్రెలు, మేకల సంతలతో ఆదాయం బాగుంది. – కె.గోవిందు, ఎంపికశ్రేణి కార్యదర్శి

గొర్రెలు, మేకలు, పశువుల సంతలతో..

వ్యవసాయ ఆధారిత జిల్లా. రైతులకు, కాపర్లకు పశువులు జీవాలే జీవనాధారం. అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం గొర్రెలు, మేకలు సంత, ఆదివారం పశువుల సంతలు నిర్వహిస్తారు. జిల్లా వ్యాపారులతో పాటు బెంగళూరు, హైదరాబాదు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వ్యాపారులు సంతకు వస్తుంటారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు (23వ తేదీ వరకు) నెలకు నాలుగు సంతల చొప్పున ఆరు నెలలకు 24 సంతలు జరిగాయి. మొత్తం రూ.90,19,335 ఆదాయం వచ్చింది. అందులో గొర్రెలు, మేకల సంతలో రూ.48,58,135 ఆదాయం రాగా, పశువుల సంతలో రూ.41,61,200 ఆదాయం వచ్చింది. గత రెండు వారాల నుంచి పశువులు, గొర్రెల సంతలతో ఆదాయం బాగా పెరిగింది.



మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)
అనంత నగరపాలక: 8008573011, రూరల్: 8008573010, రుద్రంపేట: 9989195979, ఎస్కేయూ: 8008573005 రాప్తాడు: 6304766286, ఆత్మకూరు: 7995067003

సమస్య: రుద్రంపేట- ఆలమూరు రోడ్డులో రాత్రి పూట అంధకారం అవుతోంది. ఇబ్బందులు పడుతున్నాం **- బాలన్న, న్యాయవాది**

సమస్య: ఆలమూరు రోడ్డు రైస్‌మిల్ దగ్గర వీధి లైట్లు వెలగలేదు. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం **- ఆదినారాయణ, స్థానికుడు**

ప్రశ్న: ఆలమూరు రోడ్డు షెకీనా చర్చ్ సమీపాన వీధి దీపాలు వెలగలేదు. **- జయపాల్, ఉపాధ్యాయుడు**

సమాధానం: ఆయా ప్రాంతాల్లో పరిశీలించి వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. - **పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున రెడ్డి**

- న్యూస్‌టుడే, రుద్రంపేట

కులసంఘాల పేరుతో దందా.. కఠిన చర్యలకు డిమాండ్

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: విద్యార్థి, కుల సంఘాల ముసుగులో కొందరు చేస్తున్న దందాలపై చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రైవేటు పాఠశాలల సంఘం నాయకులు జిల్లా ఎస్పీ జగదీశ్‌కు విన్నవించారు. ఈ మేరకు వారు బుధవారం ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డిలు మాట్లాడుతూ.. కొంతకాలంగా సంఘాల ముసుగులో కొందరు యువకులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లి యాజమాన్యాలను బెదిరించి భయభ్రాంతులకు గురి చేస్తూ డబ్బు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. అలా ఇవ్వని పక్షంలో కలెక్టర్‌కు, డీఈవోకు వసతులు సరిగాలేవని ఫిర్యాదు చేస్తామని భయపెడుతున్నారన్నారు. గతంలో ఇలాంటి నకిలీ విద్యార్థి సంఘాలు వసూలుకు పాల్పడుతుంటే పోలీసు ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. అయితే ఐదు నెలలుగా తిరిగి దందాలు మొదలయ్యాయన్నారు.

కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు

అనంతపురం (కళ్యాణదుర్గంరోడ్డు): తెదేపా కష్టపడిన కార్యకర్తలు, నాయకులకు తగిన గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్, ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం అనంతపురం అర్బన్ తెదేపా కార్యాలయంలో అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్, ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్‌ను సన్మానించారు. అన్ని కులస్తులను దృష్టిలో పెట్టుకుని సమాన ప్రాధాన్యం ఇవ్వడమే తెదేపా ప్రధాన ఉద్దేశమన్నారు. లక్ష్మీనరసింహులు, వెంకట్రాముడు, వెంకటేశ్, మంజునాథ, కుల్వంత్, స్వరూప్ పాల్గొన్నారు.

● అనంతపురం అర్బన్ తెదేపా కార్యాలయంలో మున్సిపల్ కార్మికులకు తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి లక్ష్మీనరసింహ.. ఎంపీ, ఎమ్మెల్యే చేతుల మీదుగా కంప్యూటర్ వితరణ చేశారు.

తెదేపాతోనే బీసీలకు పెద్దపీట

కళ్యాణదుర్గంరోడ్డు: రాష్ట్రంలో తెదేపాతోనే బీసీలకు పెద్దపీట వేస్తోందని ఆ పార్టీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆవులకృష్ణయ్య పేర్కొన్నారు. బుధవారం జిల్లా తెదేపా కార్యాలయంలో బీసీసెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే నామినేటెడ్ పదవుల్లో ఎక్కువగా భాగం బీసీలకే కేటాయించడంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.

అవినీతి లెక్కలు బయటకు తీస్తాం: ఎమ్మెల్యే

అనంతపురం(కళ్యాణదుర్గంరోడ్డు), న్యూస్‌టుడే : అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం హయాంలో జరిగిన అవినీతి లెక్కలన్నీ బయటకు తీస్తామని, అనంత నగర మేయర్ వసీం, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి ఎట్టి పరిస్థితుల్లో తప్పించుకోలేరని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ హెచ్చరించారు. బుధవారం అనంత నగరం మారుతినగర్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించగా, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో పాటు హాజరయ్యారు. "అనంతపురం అర్బన్‌లో అవినీతి జరిగింది. వాటిన్నంటిపై విచారణ జరుగుతుంది. డంపింగ్ యార్డు అవినీతి అంశాన్ని సంయుక్త కలెక్టర్ శివనారాయణశర్మతో విచారణ చేయిస్తున్నాం. పనిముట్లు వ్యవహారంలో ఇప్పటికే ఫిర్యాదులు వచ్చాయి., వీటిపై కూడా విచారణ జరుగుతుంది. నగరంలో



మాట్లాడుతున్న దగ్గుపాటి ప్రసాద్, చిత్రంలో వెంకటశివుడు యాదవ్, పెండ్యాల శ్రీలత తదితరులు

రూ.300 కోట్లతో జాతీయ రహదారి విస్తరణ పనులు జరిగాయని మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి చెప్పుకుంటున్నారు. నగరంలో రహదారులన్నీ వంకర టింకరగా తిరిగాయి. ఇందులోనూ పెద్ద ఎత్తున అవినీతి కథ ఉంది. అక్రమాలకు పాల్పడిన నాయకులు ఎవరూ తప్పించుకోలేరు" అని ఎమ్మెల్యే హెచ్చరించారు. నాయకులు గాసుల ఆదెన్న, గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గౌస్‌మోద్దీన్ పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమమే లక్ష్యం

అనంతపురం (కళ్యాణదుర్గంరోడ్డు): ముస్లిం, మైనార్టీల సంక్షేమమే తెదేపా ప్రధాన ఉద్దేశమని తెదేపా జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, అనంతపురం పార్లమెంటు సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణ, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం అనంతపురం నగరం ఒకటో డివిజన్ ఎర్రనేలకొట్టాలలో ఉదయం, సాయంత్రం మారుతినగర్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం దూదేకుల ఫెడరేషన్‌కు రూ.100 కోట్లు కేటాయించిందని, హజ్ యాత్రికులకు రూ.లక్ష ఇస్తున్నట్లు ప్రకటించడం జరిగిందన్నారు. తలారి ఆదినారాయణ, గౌస్‌మొద్దీన్, పెండ్యాల శ్రీలత, స్వప్న, కొండవీటి భావన, బల్లాపల్లవి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

అరవిందనగర్(అనంతపురం): పర్యావరణ పరిరక్షణకు ప్రజలు తమ వంతు కృషి చేయాలని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ శ్రీదేవి పేర్కొన్నారు. ముఖ్య అతిథి జిల్లా ఎస్పీ జగదీశ్ మాట్లాడుతూ.. పచ్చదనం పెంపుతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా నగరంలోని జిల్లా ఎస్పీ ప్రధాన కార్యాలయం ఆవరణలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు అధికారులు, ఉద్యోగులు మొక్కలు నాటారు.



మొక్క నాటుతున్న ఏపీజీబీ ఆర్‌యం శ్రీదేవి, జిల్లా ఎస్పీ జగదీశ్

దాడి కేసులో నిందితులకు జైలు

అనంతపురం(లీగల్), న్యూస్‌టుడే: దాడి కేసులో నిందితులకు ఆరు నెలల జైలు శిక్ష, రూ.11 వేలు జరిమానా విధిస్తూ మొబైల్ కోర్టు న్యాయమూర్తి సుజిన్‌కుమార్ బుధవారం తీర్పునిచ్చారు. కూడేరు మండలం నాగిరెడ్డిపల్లి గ్రామస్థులైన మీనుగు సంగప్ప, అతని సోదరుడు సుబ్బరాయుడులకు మధ్య అనంతపురంలో ఆస్తి వివాదం ఉంది. ఈ వివాదం నేపథ్యంలో మీనుగు సంగప్ప, అతని కుమారుడు కిశోర్‌కుమార్, కూతురు సంధ్యారాణిలు కలిసి బాధితుడు సుబ్బరాయుడు, అతని సోదరి దీనమ్మలపై దాడి చేశారు. మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును మొబైల్ కోర్టు విచారణ చేపట్టింది. ఇరువర్గాల వాదనలను పరిశీలించారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ శ్రీనివాసులు వాదనలు వినిపించారు. నిందితులపై నేరారోపణ రుజువు కావడంతో సంగప్ప, కిశోర్‌కుమార్, సంధ్యారాణిలకు ఆరు నెలల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.11 వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది.

ఇసుక అక్రమ తరలింపు

రాప్తాడు, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం రాంపురం నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా వాహనాలు పట్టుకున్నారు. అనంతపురం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం మన్నీల క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇతర ప్రాంతాలకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీ, టిప్పర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఇటుకలపల్లి ఎస్సై విజయకుమార్ తెలిపారు. సీఐ హేమంత్‌కుమార్, ఎస్సై విజయకుమార్ గత నెల వ్యవధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న 11 ట్రాక్టర్లు, 05 టిప్పర్లు, ఒక లారీని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వైద్యరంగంలో ఫార్మాసిస్టుల పాత్ర ఎనలేనిది

ఎస్కేయూ: వైద్య, ఆరోగ్య రంగంలో ఫార్మాసిస్టుల పాత్రల ఎనలేనిదని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాయలం ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య అనిత పేర్కొన్నారు. ఎస్కేయూ ఫార్మసీ కళాశాలలో అంతర్జాతీయ ఫార్మాసిస్టు దినోత్సవం నిర్వహించారు. ఔషధరంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలని ఫార్మసీ విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. తక్కువ ధరలకు నాణ్యమైన మందులు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు 55 మంది రక్తదానం చేశారు.

క్రీడల అభివృద్ధికి కృషి: క్రీడల అభివృద్ధికి వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలని ఉపకులపతి అనిత పేర్కొన్నారు. ఎస్కేయూ స్పోర్ట్స్ బోర్డు సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని, వర్సిటీ అనుబంధ కళాశాలల్లో తప్పకుండా వ్యాయామ అధ్యాపకులు ఉండాలని, క్రీడా పోటీలు నిర్వహించాలని సూచించారు. ఎస్కేయూ అంతర్ కళాశాలల క్రీడా వార్షిక ప్రణాళికను ఈ సమావేశంలో రూపొందించారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎస్కేయూ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య అనిత

పోలీసుల అదుపులో వైకాపా నాయకుడు!

అనంత నేరవార్తలు: రాప్తాడు నియోజకవర్గానికి చెందిన వైకాపా నాయకుడిని ఓ చీటింగ్ కేసులో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఆత్మకూరు మండలం పి.యాలేరు గ్రామానికి ఆంథోనిరెడ్డి వైకాపాలో నాయకుడిగా చలామణి అయ్యేవాడు. కాంట్రాక్టు ఇప్పిస్తానని, భూమి సమస్యలు పరిష్కరిస్తానని పలువురి వద్ద డబ్బు తీసుకుని మోసం చేశాడనే ఆరోపణలు ఉన్నాయి. గుప్తనిధుల కేసులు, కిడ్నాప్, చీటింగ్ కేసులు నమోదయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో ఉత్తర భారతదేశంలోని ఓ రాష్ట్రానికి చెందిన వ్యక్తిని రూ.కోట్లలో మోసం చేసినట్లు సమాచారం. మంగళవారం ఉదయం ఇంటి నుంచి పోలీసు బలగాలు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

అవీ.. ఇవీ.. అన్నీ..

వరద బాధితులకు రూ.3లక్షల సాయం

అనంతపురం(కళ్యాణదుర్గంరోడ్డు) : విజయవాడ వరద బాధితులకు అనంతపురం నగరానికి చెందిన రాజహంస బిల్డర్స్ సాయం అందించేందుకు ముందుకొచ్చారు. రూ.3 లక్షలు విరాళం ప్రకటించారు. బుధవారం అనంతపురం అర్బన్ తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్‌ను కలిసిన ప్రతినిధులు చెక్కును అందజేశారు.

జీవో 86 రద్దుకు వైద్యుల డిమాండ్

అనంతపురం(వైద్యం): జీవో నంబరు 85ని రద్దు చేయాలని కోరుతూ అనంతపురం డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట బుధవారం పీహెచ్‌సీ వైద్యులు నిరసన తెలిపారు. ఆ సంఘం నేతలు మాట్లాడారు. ఇన్ సర్వీస్ పీజీ సీట్లను కుదించటంతో తమకు అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో అమలు చేస్తున్న విధంగానే 30 పీజీ సీట్లు కేటాయించాలని కోరారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, లోకేష్, మనోజ్‌తో పాటు పీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.

28న ఆలయాల్లో వైకాపా ప్రత్యేక పూజలు

రాణినగర్: తిరుమల పవిత్రతను ప్రసాదం విశిష్టతను చంద్రబాబు అపవిత్రం చేశారని వైకాపా జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా వైకాపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 28న జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టాలని వైకాపా శ్రేణులకు పిలుపు నిచ్చారు.

వర్సిటీల్లోని సిబ్బందిని రెగ్యులర్ చేయాలి

ఎస్కేయూ: ఎస్కేయూ, జేఎన్‌టీయూలో పనిచేస్తున్న సిబ్బందిని రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌తో సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 30న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నామన్నారు. వాటికి సంబంధించిన కరపత్రాలు బుధవారం ఎస్కేయూలో విడుదల చేశారు.

భవనాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

తపోవనం (అనంత గ్రామీణం): అనంతపురం ఆర్డీఓ, అర్బన్, గ్రామీణ తహశీల్దారు కార్యాలయాలకు సొంత భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంయుక్త కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశించారు. బుధవారం అనంతపురం అర్బన్, గ్రామీణ తహశీల్దారు కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రస్తుతం ఉన్న కార్యాలయ భవనాలు ఇరుకుగా ఉన్నాయని, గడియార స్తంభం వద్ద స్థలంలో కొత్త భవనాల నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయించాలని సూచించారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద వృథాగా



అంబేడ్కర్ విగ్రహం వద్ద..

నిర్వహణ చేయలేనప్పుడు ఏర్పాటు ఎందుకు?

అనంతనగరం సుందరీకరణలో భాగంగా వివిధ కూడళ్ల వద్ద ఉన్న నాయకుల విగ్రహాల వద్ద వాటర్ ఫౌంటెన్‌లు ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం వీటిలో ఏవీ పని చేయటం లేదు. ఆయా ప్రాంతాల్లో ఈ ఫౌంటెన్లు బాగుచేసి తగిన విధంగా విద్యుత్ వెలుగులు ఏర్పాటు చేస్తే చూసేందుకు ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది.


- ఈనాడు, అనంతపురం

పార్టీకి పని చేసిన వారిని గుర్తించండి

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే : పార్టీ కోసం కొన్నేళ్లుగా పనిచేస్తున్న వారిని గుర్తించాలని అనంతపురం నగరంలోని 8వ డివిజన్ తెదేపా ఇన్‌ఛార్జి రంగనాథ్, గోపాల్, పుల్లప్ప కోరారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే తెదేపా కార్యకర్తలను కాకుండా వైకాపాలో పని చేసిన కొంతమందిని వెంటబెట్టుకొని ప్రజల వద్దకు వెళుతున్నారని ఆరోపించారు. పదేళ్లుగా పార్టీ కోసం పని చేస్తూ ఎన్నికల్లో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా గెలుపించుకోవాలని పని చేశామన్నారు. అధికారంలోకి వచ్చాక కార్యకర్తల మనోభావాలు దెబ్బతినేలా పలువురు నాయకులు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం సొంత డబ్బు ఖర్చు పెట్టుకున్నామని, విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

విద్యుత్తు నియంత్రిక.. ప్రమాదకరంగా

రుద్రంపేట పంచాయతీ పరిధి వికాస్ నగర్‌లో రెండు విద్యుత్తు నియంత్రికలు ఒకేచోట ఏర్పాటు చేయడం ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోంది. విద్యుత్తు నియంత్రికలు మనిషికి అందే ఎత్తులో ఉండటంతో చిన్నారులు వాటికి తాకే ప్రమాదముంది. విద్యుత్తు స్తంభాలు వంగి కిందికి పడిపోయే ఆస్కారం ఉంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రుద్రంపేట**



తెరపై ఈనాడు

కమలానగర్, న్యూస్‌టుడే : గంగ : **గొర్రె పురాణం,** గౌరి : **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్,** గాయత్రి : **హైడ్ అన్ సీక్,** గౌతమి : **మిస్టర్ బచ్చన్,** త్రివేణి : **మత్తు వదలరా-2,** తేజస్విని : **చిక్లెట్స్ 2కె, జర్ని,** తరంగిణి : **ట్రాన్స్‌ఫర్మర్-I,** ఎస్వీ సినిమాక్స్ : **సరిపోదా శనివారం,** నీలిమ : **బొమ్మరిల్లు.**



అజయ్‌గోష్ కాలనీ నుంచి మదర్ థెరీసా కాలనీకి వెళ్లే రహదారిపై పిచ్చిమొక్కలు, చెత్తకుప్పలు



ఇళ్లను చుట్టేసిన పిచ్చి మొక్కలు

చీకటి పడితే ఇళ్లకు రాలేం

రుద్రంపేట పంచాయతీ పరిధిలోని మదర్ థెరీసా కాలనీ, అజయ్‌గోష్ కాలనీలకు ప్రధాన రహదారులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలకు తాత్కాలికంగా ఉన్న మట్టి రోడ్లపై పిచ్చి మొక్కలు, చెత్త కుప్పలుగా ఉండటంతో విష సర్పాలు సంచిరిస్తుండటంతో భయాందోళనలు చెందుతున్నామని స్థానికులు చెబుతున్నారు. చీకటి పడితే ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితిలో ఉన్నామని మహిళలు తెలిపారు. నివాసం ఉంటున్న ఇళ్లలోకి రహదారి సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నామని బాధితులు తెలిపారు. కాలనీలో రహదారులు, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, రుద్రం పేట

జీవో 42 రద్దుకు వినతి

ఎస్కేయూ: ఎయిడెడ్, ప్రభుత్వ అధ్యాపకుల సమస్యలకు కారణమైన 42వ నంబరు జీవో రద్దు చేయాలని ప్రభుత్వ అధ్యాపకుల సంఘం విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ డిగ్రీ అధ్యాపకుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయప్ప, శ్రీధర్, రాజశేఖర్; అచ్యుతానంద, బాలాజీ మంత్రి సవితను బుధవారం కలిశారు. ఎయిడెడ్ అధ్యాపకులను ప్రభుత్వ కళాశాలల్లో విలీనం చేస్తూ గత ప్రభుత్వం 42వ నెంబరు జీవో జారీ చేసింది. అసంబద్ధంగా ఉత్తర్వులు ఉన్నాయన్నారు.

సామూహిక సీమంతంలో గందరగోళం

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: 'పోషణ్ మహ' కార్యక్రమంలో భాగంగా బుధవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'సామూహిక సీమంతం' ప్రక్రియ గందరగోళంగా మారింది. లబ్ధిదారుల కంటే అంగన్‌వాడీ సిబ్బంది ఎక్కువ రావడం విశేషం. సీమంతం, అన్నప్రాశన అస్తవ్యస్తంగా సాగింది. నిర్వహణలో లోపాలు తలెత్తాయి. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, నగర ఉప మేయర్ కొగటం విజయ్‌భాస్కర్ రెడ్డి.. వంటి ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. అప్పటికే వేదికపై కొన్ని శాఖల జిల్లా అధికారులు కూర్చున్నారు. ప్రజాప్రతినిధులు వచ్చినా కొందరు అధికారులు కుర్చీలు ఇవ్వలేదు. వేదికపైనే వెనుక వరుసలో కూర్చోవాలని ఐసీడీఎస్ అధికారులు బలవంతంగా చెప్పాల్సి వచ్చింది. తొలుత ప్రజాప్రతినిధులు కొందరు గర్భిణులకు సీమంతం నిర్వహించారు. వీరు వెళ్లిన తర్వాత కలెక్టర్ వినోద్‌కుమార్ హాజరయ్యారు. కొద్దిసేపు ఉండి వెళ్లిపోయారు. అనంతరం 30 మందికి సామూహికంగా సీమంతం చేశారు. ఈలోపు చంటిబిడ్డలతో వచ్చిన తల్లులు ఇబ్బంది పడ్డారు. అక్కడి హాలు మొత్తం కిక్కిరిసిపోయింది. పలు రకాల పౌష్టికాహార ప్రదర్శన పెట్టినా ఎవరూ సందర్శించలేదు.



మహిళలతో కిక్కిరిసిన రెవెన్యూ భవన్

వంద రోజుల్లో ఏమి చేశారో చెప్పాలి

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: వంద రోజుల్లో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నగరానికి ఏమి చేశారో చెప్పాలని మేయర్ వసీం ప్రశ్నించారు. బుధవారం వైకాపా జిల్లా కార్యాలయంలో కార్పొరేటర్లతో కలిసి ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రధాన హామీలైన డంపింగ్ యార్డు తరలింపు, భూగర్భ మురుగు కాలువ నిర్మాణం, రింగురోడ్డు, పరిశ్రమలు తీసుకొచ్చి నిరుద్యోగులకు ఉపాధి ఏమేరకు చేశారో చెప్పాలన్నారు.